


నిజాయితీ - నిష్పాక్షికత
# వార్తలు
దిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : ఈశ్వరగారి రమణ

నిజాయితీ - నిష్పాక్షికత
వార్తలు
దిన పత్రిక



50 సంవత్సరాల అనుభవం కలిగిన జర్నలిస్టుల ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా దిగ్విజయంగా నిర్వహించబడుతున్నటువంటి వార్తలు దినపత్రికకు ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ లోని జిల్లాల వారీగా మండల వారీగా విలేకరులు కావలెను

040-2001 2222 +91-9000279919



www.vaarthalu.in

గురువారం , సెప్టెంబర్ 24, 2026 , సంపుటి : 18 సంచిక : 307 - పేజీలు - 10


## ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 నాటి చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు వెలువడింది. ఈ కేసును విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్.సి. శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి

మిగతా2లో...


# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

### - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను ప్రభుత్వం ముమ్మరం చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న సమ్మిట్ ఏర్పాట్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించింది.తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా భారీ పెట్టుబడులను ఆకర్షించాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహించడంతో పాటు పెట్టుబడులకు అవకాశాలు ఉన్న దేశాలు, నగరాలు, రంగాలపై ప్రత్యేక అధ్యయనం చేయాలని నిర్ణయించారు.సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణ

మిగతా2లో...



## రైతుల పోరాటం ఫలించింది..

- జూరాల కాలువలకు నీటి విడుదల
కుడి, ఎడమ కాలువలకు సాగునీరు.. కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటికి హామీ

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సాగునీటి కోసం జూరాల ఆయకట్టు రైతులు చేపట్టిన ఆందోళన

మిగతా2లో...

## ప్రజల ముంగిటకే 'మీ సేవ'లు: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు లిలి'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్'లిలిను ప్రారంభించింది. ఆర్టీసీ కళ్యాణ మండపంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 108 ప్రభుత్వ మీ సేవ కేంద్రాలతో పాటు 5,400కు పైగా ప్రైవేట్ మీ సేవ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్‌లో మీ సేవ కేంద్రాల సంఖ్యను మరింత పెంచుతామని చెప్పారు.ఇకపై ప్రజలు మీ సేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం లేదా మీ సేవ పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఇంటి వద్ద నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. మీ సేవ ఎగ్జిక్యూటివ్‌లు నేరుగా ఇంటికి వచ్చి అవసరమైన సేవలను అందించనున్నారు.

మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

ఏపీకి అరవింద్ భదౌరియా.. తెలంగాణకు సునీల్ బన్సల్
ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగు నేతలకు బాధ్యతలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 23 :** బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చోటుచేసుకు న్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చా ర్జిలు, కో-ఇన్‌చార్జిలను పార్టీ అధిష్ఠానం నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ నియామకాలు

మిగతా2లో...

## తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

అశ్వాపురం రైతుల చిరకాల స్వప్నం సాకారం
'మారేళ్లపాడు ఎత్తిపోతల'ను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
తొలి విడతలో 4,300 ఎకరాలకు.. దశలవారీగా 23 వేల ఎకరాలకు సాగునీరు



2లో

## జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

- బీఆర్ఎస్ఎల్పీ ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు డిమాండ్
- గురుదక్షిణ కింద తెలంగాణ వాటాను ఆంధ్రాకు ధారాదత్తం



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, సా గునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు ద మ్ముంటే మూడేళ్లల్లో కృష్ణ, గోదావరి జలాలు ఎంత వినియోగమయ్యాయో శ్వేతపత్రం ప్రక టించాలని బీఆర్ఎస్ ఎల్పీ ఉపనాయకుడు త న్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గురుదక్షి ణ కింద కృష్ణ, గోదావ రి జలాలను ఆంధ్ర ప్రాం తానికి ధారాదత్తం చేయడం తప్పా రైతాంగాని కి ప్రయోజనం చేకూరిన అంశం ఒక్కటి

మిగతా2లో...

## కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మూత
జెన్‌కోకు నాసిరకం బొగ్గు సరఫరాతో రూ.2,900 కోట్ల నష్టం
నేడు పవర్‌ప్లాంట్ల సందర్శన : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే కరెంటు కోతలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. బొగ్గు కొరత కారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోవిద్యుత్ ఉత్పత్తి నిలిపేస్తున్నారని అన్నారు. నీటి కొరత వల్ల జల విద్యుత్ కేంద్రాలు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోతున్నాయని చెప్పారు. ఇప్పుడే విద్యుత్ కోతలు ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ కేంద్రాల వద్ద వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు గురువారం ఆరు బీఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నాయని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేటీఆర్

మిగతా2లో...

## మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

స్పష్టం చేసిన ఇరాన్...న్యూయార్క్‌లో అమెరికా ప్రతినిధులతో అరాగ్చీ భేటీ





2లో



## దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

తుంగతుర్తికి దేవాదుల జలాలు తీసుకొస్తాం..
ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** గోదావరి, దేవాదుల ప్రాజెక్టుల నీటిని సంపూర్ణంగా వినియోగించుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు నీటిని తీసుకొస్తానని హామీ ఇచ్చారు.బుధవారం సూర్యాపేట జిల్లాలో పర్యటించిన మంత్రి ఉత్తమ్

మిగతా2లో...

# రైతుల పోరాటం ఫలించింది..

(మొదటి పేజీ తరువాయి)

ఫలించింది. వారం రోజులుగా పంట కాలువలకు నీటిని విడుదల చేయాలని రైతులు చేస్తున్న పోరాటం నేపథ్యంలో బుధవారం జూరాల రిజర్వాయర్ నుంచి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంట కాలువలకు నీరు విడుదల చేయాలని రైతులు ఆందోళన చేపట్టగా, గత రెండు రోజులుగా నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కూడా మద్దతు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు మాత్రమే జూరాలలో నీరు ఉందని అధికారులు చెప్పడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. **కర్ణాటక నుంచి నీటికి హామీ**జూరాల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యను ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కర్ణాటకకు వెళ్లిన ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులు బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 30 రోజులపాటు రోజుకు 5 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం 7 టీఎంసీల నీటిని జూరాల ప్రాజెక్టుకు విడుదల చేస్తామని డీకే శివకుమార్ హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. **2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులోకి ప్రస్తుతం 2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు బుధవారం ఉదయం 8 గంటల సమయంలో కుడి, ఎడమ కాలువల వద్దకు చేరుకుని తూములను తెరిచి నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో ఇదే స్థాయిలో కొనసాగితే ప్రాజెక్టు నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే స్పిల్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. **రైతుల్లో ఉపశమనం** సాగునీటి కోసం రైతులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో కాలువలకు నీరు విడుదల కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కర్ణాటక నుంచి 7 టీఎంసీల నీటి విడుదలకు హామీ లభించడంతో జూరాల ఆయకట్టు సాగునీటి అవసరాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే కరెంటు కోతలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదనీ, జీవనరేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు.'ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో' విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావం కారణం కాదనీ, ఎల్ కాంగో (కాంగ్రెస్) ప్రధాన కారణమని కేటీఆర్ విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని అన్నారు.సింగరేణితో సర్కార్ ఫుట్‌బాల్ సింగరేణి సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ అన్నారు. సింగరేణితో కార్మికులు, రైతులు, ప్రజలు ఆటలాడే పరిస్థితి రావొద్దని కోరారు. సింగరేణిలో సైట్ విజిటేషన్ సర్టిఫికెట్ల పేరుతో అక్రమాలు, సోలార్ పవర్ టెండర్లలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 2023–24లో 70 మిలియన్ టన్నుల నుంచి 2025–26లో 58 మిలియన్ టన్నులకు ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఆరు గంటల కరెంటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు‘ కాంగ్రెస్ అధికారంలో ఉంటే కరెంటు ఉండదని కేటీఆర్ అన్నారు. అదే ఇప్పుడు నిజమైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ కోతలపై రోడ్డెక్కారని గుర్తు చేశారు. విద్యుత్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు గురువారం పవర్ స్టేషన్లను సందర్శిస్తాయని చెప్పారు.యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి,చెన్నూరు నియోజకవర్గం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌ల బృందం సందర్శిస్తుందని వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్ పరిశీలిస్తారని చెప్పారు. మాజీమంత్రులు తాటికొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, ఎల్ రమణ, ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఎ జీవన్‌రెడ్డి, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల చెరువుకు గోదావరి జలాలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న రైతుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో సీతారామ కాలువపై నిర్మించిన మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని బుధవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంపులు ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనాతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అనంతరం గొందిగూడెంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక నుంచి పాలేరు వరకు గోదావరి జలాలను తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనుమతులు, సవరించిన అంచనాలను అధిగమిస్తూ పనులు చేయిస్తున్ను తెలిపారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు అదనపు నిధులను సీఎం మంజూరు చేశారని, ఇల్లెందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతలపై సర్వేలు చేసి అంచనాలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా జలాలు విడుదల చేస్తున్నామని చెప్పారు. భూసేకరణలో రైతులు సహకరించాలని కోరారు. న్యాయమైన పరిహారం రైతులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు కృషి చేస్తున్నామని, భద్రాచలంలో ప్రగల్లపల్లి ఎత్తిపోతలతో పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు నీరు అందుతుందన్నారు. ప్రస్తుత వర్షాభావం, ఎల్‌నినో నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, రబీలో తక్కువ నీటి పంటలు వేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తామన్నారు. రూ.350 కోట్లతో భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించామని, పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పులుసుబొంత్ ప్రాజెక్టు భూసేకరణ, ప్రత్యామ్నాయ భూముల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలుస్తామన్నారు. బూర్గంపాడులో దొమ్మలవాగు రిజర్వాయర్‌పై ప్రజల అవసరాల మేరకు చర్యలు తీసుకుంటామని, గిరిజన గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, యువత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారేళ్లపాడు ద్వారా అశ్వాపురంలో 24 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దశాబ్దాల కల నెరవేరిందని, గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరడం పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. తుమ్మల ప్రధాన కాలువకు లైనింగ్, 22 కి.మీ డిస్ట్రిబ్యూటరీలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మణుగూరు రేగులగండి చెరువుకు నీరిస్తే 4 వేల ఎకరాల్లో మూడు పంటలు పండుతాయని, దొమ్మలవాగును మినీ రిజర్వాయర్‌గా చేయాలని కోరగా మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. మారేళ్లపాడుతో పాటు జిల్లాలో 16 వేల ఎకరాలకు సాగునీటి పనులకు శ్రీకారం చుట్టామని, పులుసుబొంత్‌కు కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ భూముల గుర్తింపు కొనసాగుతోందన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ సహా 8 మండలాల్లో డిస్ట్రిబ్యూటరీల సర్వే 60 శాతం పూర్తయిందని, సీతమ్మసాగర్‌కు 600 ఎకరాల భూసేకరణ అవార్డు దశలో ఉందని, రూ.46 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజ్, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# జలాల వినియోగంపై శ్వేతపత్రం ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

కూడా లేదని దుయ్యబట్టారు. బుధవారం నాగర్‌కర్నూ ల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం పేరు చెప్పి కాంగ్రెస్ నేతలంతా ప్రకృతిని నింది స్తున్నారని, పాలమూరు జిల్లాలో ప్రతీ ప్రాజెక్టు ను సందర్శిస్తే కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు కన్పి స్తున్నాయన్నారు. కృష్ణానది జలాల వినియోగం లో ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు 36 టీఎంసీల నీటిని తెలంగాణ సాగు భూములకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంకెల గారడీతో రైతాంగాన్ని మోసగించే ప్రయత్నం చే యడం ఏమాత్రం సహించరని విషయమన్నా రు. కేసీఆర్ చాలా దూరదృష్టితో కృష్ణ, గోదావరి జలాలపై లిఫ్టులు, రిజర్వాయర్లు నిర్మించారని, బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ అధికారంలో ఎన్ని ఎకరాల సాగు భూములకు నీరందించారో వివ రాలతో శ్వేతపత్రం ప్రకటించాలని ఆయన డి మాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొం త జిల్లాలో ఎకరా పంట ఎండినా సహించబో మని ఇందుకోసం ఉద్య మిస్తామని స్పష్టం చే శారు. రాబోయే కాలంలో కృష్ణా, గోదావరి నదీ జలాలను మళ్లించే ప్రయత్నం చేస్తే మహోద్య మం తప్పదని హెచ్చరించారు. కేఎల్ఐ కింద ఆ యకట్టులో సింహభాగానికి, పాలమూరు రంగా రెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లాపూర్, ఏదు ల, వట్టెం రిజర్వాయర్ల వరకు కృష్ణా జలాలను పంపింగ్ చేసిన ఘనత కేసీఆర్‌దేనని ఈ అంశంపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావాలని, వేదిక వాళ్లే నిర్ణయించాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు.. తీరం వైపు తీవ్ర వాయుగుండం

## నేటి అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణంవైపు తీరం దాటే చాన్స్

## పలు రాష్ట్రాల్లో నైరుతి నిష్క్రమణ

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 :** పశ్చిమ–మధ్య బంగాళాఖాతం, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నదని హైదరాబాద్ వాతావారణశాఖ తెలిపింది. గోపాల్‌పురం–కళింగ పట్టణానికి సమీపంలో తీవ్ర వాయుగుండంగా బలపడి బుధవారం అర్ధరాత్రి కళింగపట్నం దక్షిణ తీరాన్ని దాటే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తెలంగాణలో గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు.

# ఈసీ నియామక చట్టంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పులు

(మొదటి పేజీ తరువాయి)

రాలేకపోయింది. దీంతో ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.**ఏకగ్రీవ తీర్పు వచ్చి ఉంటే బాగుండేది: దత్తా** ఈ అంశంపై ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చి ఉంటే సంస్థాగత ఐక్యతకు మరింత ప్రయోజనకరంగా ఉండేదని జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో సుదీర్ఘమైన ఉత్తర్వులు వెలువరించాల్సి వచ్చిందని తెలిపారు.**పాలకులు చట్టానికి లోబడి ఉండాలి** తీర్పు సందర్భంగా జస్టిస్ దత్తా కీలక వ్యాఖ్యలు చేశారు. “పాలకులు చట్టానికి లోబడి ఉండాలి.. ఎవరూ చట్టానికి అతీతులు కారు” అని స్పష్టం చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా కాకుండా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే పరిపాలన సాగాలని ఆయన ఉద్ఘాటించారు.**కొలీజియం వ్యవస్థపై స్పష్టత** జడ్జీల నియామకం, కొలీజియం వ్యవస్థపై జరుగుతున్న ప్రచారంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. “జడ్జీలే తమ సహచర జడ్జీలను నియమించుకుంటున్నారు” అనే ప్రచారం వాస్తవానికి దూరంగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తుల అభ్యర్థుల పరిశీలన, ఎంపిక ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇతర నిఘా వ్యవస్థల పాత్ర కూడా ఉంటుందని ధర్మాసనం వివరించింది.

# తెలుగు రాష్ట్రాలకు కొత్త బీజేపీ ఇన్‌చార్జిలు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియా, కో–ఇన్‌చార్జిగా వనతి శ్రీనివాసన్‌ను నియమించారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్, కో–ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, రేఖా శర్మలను నియమించారు.**ఇతర రాష్ట్రాల్లో తెలుగు నేతలకు బాధ్యతలు** తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను కూడా పార్టీ అప్పగించింది. ఏపీ బీజేపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని ఒడిశా బీజేపీ ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణకు తమిళనాడు బీజేపీ కో–ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో–ఇన్‌చార్జిగా నియమించారు.**సంస్థాగత విస్తరణపై దృష్టి** రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం, రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ప్రకటించినట్లు సమాచారం. ఇదే సమయంలో కొత్త జాతీయ బృందంలో తరుణ్ చుగ్‌కు కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

# మా షరతులకు అంగీకరిస్తేనే హార్ముజ్‌ను తెరుస్తాం

**న్యూయార్క్ సెప్టెంబర్ 23 :** ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ ప్రతినిధులతో అమెరికా అధికారులు న్యూయార్క్‌లో మూడు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ భేటీ సానుకూలంగా జరిగిందని, ఒప్పందానికి రావడం రాకపోవడం ఇరాన్‌పై ఆధారపడి ఉన్నదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ‘ఇది ఓ మంచి సమావేశం. ఒప్పందానికి వస్తే వారికే ప్రయోజనం’ అని వ్యాఖ్యానించారు. ఘర్షణల నివారణ కోసం ఇరాన్ ఎందుకు ఒప్పందం చేసుకోవడం లేదో తాను ఊహించలేకపోతున్నానని చెప్పారు. ఐరాస సర్వసభ్య సమావేశాలకు హాజరవుతున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అమెరికా ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో చర్చలు జరిపారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, అన్ని రకాల పోరును నిలిపివేయాలని అరాగ్చీ ఈ సందర్భంగా డిమాండ్ చేశారని తెలిసింది. ఈ డిమాండ్లను నెరవేరిస్తే హార్ముజ్ జలసంధిని తెరుస్తామని ఆయన చెప్పారు.‘వారు నాతో మాట్లాడాలని అనుకుంటున్నారు. వారు మాతో మాట్లాడుతూనే ఉన్నారు. ఈ రోజు కూడా మాట్లాడారు. ఈ సంబంధం అభివృద్ధి చెందుతోంది’ అని ఆయన తెలిపారు. చర్చలు కొనసాగుతాయని అంటూ అంతిమంగా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అయితే అణ్వాయుధాన్ని పొందకుండా ఇరాన్‌ను నిరోధిస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలపై తాను చాలా సంతోషంగా ఉన్నానని విట్‌కాఫ్ వ్యాఖ్యానించారు. మధ్యవర్తులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తారని ఆయన చెప్పారు. కాగా గల్ఫ్, ప్రాంతీయ దేశాల దౌత్య యత్నాల కారణంగానే అమెరికా, ఇరాన్ ప్రతినిధులు చర్చలు జరిపారని తెలుస్తోంది.

# తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ సమ్మిట్ కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కోసం సుమారు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సీనియర్ అధికారులు, మంత్రులకు వివిధ బాధ్యతలు అప్పగించడంతో పాటు ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసి రోజువారీగా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను వినియోగించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గతంలో కుదిరిన ఎంవోయూల అమలు పురోగతిని సమీక్షించాలని భట్టి సూచించారు.ప్రతినిధుల స్పందనను బట్టి సభా ప్రాంగణాల సంఖ్యను ప్రస్తుత 4 నుంచి 6 లేదా 8కు పెంచే అంశాన్ని పరిశీలించనున్నారు. మూడు రోజుల కార్యక్రమంగా మాత్రమే కాకుండా తెలంగాణకు దీర్ఘకాలికంగా పెట్టుబడులు, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

# ప్రజల ముంగిటకే ‘మీ సేవ’లు: మంత్రి శ్రీధర్‌బాబు

(మొదటి పేజీ తరువాయి)

జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఈసీ కాపీలు, పోలీస్ శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర పౌర సేవలను డోర్ డెలివరీ ద్వారా అందించనున్నారు.తొలిదశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ సేవలను అమలు చేసి, అనంతరం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# దేవాదుల నీటిని సంపూర్ణంగా వినియోగిస్తాం: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.**ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా..** 365 టీఎంసీల నీటిని ఒక్క చుక్క కూడా వృథా కాకుండా వినియోగించుకునేలా కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు నీటి లభ్యత, వినియోగంపై వివరాలు వెల్లడించారు. రాజకీయ దురుద్దేశాలకు తావులేకుండా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు.**తాటిపాముల అభివృద్ధికి కృషి** అధికారంలో ఉన్నా లేకున్నా తన తండ్రి కోరిక మేరకు తాటిపాముల గ్రామాన్ని తన శక్తి మేర అభివృద్ధి చేస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# భారతీయ సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేస్తున్న బాలీవుడ్ సినిమా
## (24 సెప్టెంబర్ “ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం” సందర్భంగా)

“హాలీవుడ్” పేరుకు ప్రేరణగా బొంబాయి కేంద్రంగా అంతర్జాత స్థాయి చలనచిత్రాలను నిర్మిస్తున్న హిందీ సినీ పరిశ్రమను “బాలీవుడ్” అని పిలుస్తున్నాం. 1970ల్లో ప్రారంభంపైన బాలీవుడ్ సినీ వైభవం నేడు హాలీవుడ్ దృష్టిని కూడా ఆకర్షించడం, అత్యుత్తమ సినిమాలను తీస్తూ ప్రపంచ సినీ ప్రేక్షకుల మనసులు దోయడం జరుగుతోంది. హిందీ భాష సినిమాల ద్వారా భారతీయ నృత్యాలు, సాంస్కృతిక వారసత్వ సంపద, కళలు, గీతాలు, సంగీత మాధుర్యాలను భారతీయ ప్రేక్షకులకు కాకుండా ప్రపంచ దేశాల ప్రజల మన్ననలు సహితం పొందడం మన బాలీవుడ్ విజయంగా భావించాలి. తెలుగు సినీ పరిశ్రమను “టాలీవుడ్” అని, కేరళ మలయాళ సినీ పరిశ్రమను “మాలీవుడ్” అని, కన్నడ సినీ పరిశ్రమను “సాండల్‌వుడ్” అని, పంజాబీ సినీ పరిశ్రమను “పాలీవుడ్” అని, గుజరాతీ సినీ పరిశ్రమను “డాలీవుడ్” అని, బెంగాలీ/మరాటీ/ఒడియా సినీ పరిశ్రమను “ఓలీవుడ్” అని, అస్సామీ సినీ పరిశ్రమను “జాలీవుడ్” అని, భోజ్‌పురీ సినీ పరిశ్రమను “భోజ్‌వుడ్” అని, తమిళ సినీ పరిశ్రమను “కొలీవుడ్” (చెన్నై, కొడంబాకమ్ పేరుతో) అని, లాహోర్ కేంద్రంగా పాకిస్థానీ సినీ పరిశ్రమను “లాలీవుడ్” అని పిలవడం పరిపాటి అయ్యింది.

**ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం :**

భారత “జాతీయ సినీ అవార్డుల ప్రదానం”, “అంతర్జాతీయ ఫిలిమ్ ఫెస్టివల్” నిర్వహణ, “ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా” ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాల నిర్వహణతో బాలీవుడ్ సినీ పరిశ్రమ ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కావడం చూస్తున్నాం. మన హిందీ సినిమాలు ప్రపంచ దేశాల్లో కూడా మంచి ఆదరణ పొందడం నేడు సర్వసాధారణం అయ్యింది. బాలీవుడ్ సినిమా ద్వారా మనసులను రంజింపజేసే సుస్వర సంగీతం, ఆకర్షణీయ క్లాసికల్/నాన్- క్లాసికల్ డ్యాన్సులు, మన ఆచార వ్యవహారాలు, భారతీయ జీవనశైలి, మానవీయ విలువలు, చారిత్రక/పౌరాణిక చరిత్రలు, మరిచి పోలేని పాత్రలు ఎన్నో మన బాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడం జరిగింది. 24 సెప్టెంబర్ 1913 రోజున దాదాసాహెబ్ పాల్కే నిర్మించిన భారత తొలి పూర్తి నిడివి కలిగిన “రాజా హరిశ్చంద్ర” సినిమా విడుదల కావడంతో ఆ అపూర్వ ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏట 24 సెప్టెంబర్ రోజున “ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం (వరల్డ్ బాలీవుడ్ డే)” పాటించడం 2014 నుంచి ప్రారంభం అయ్యింది. భారతీయ తొలి కలర్ సినిమా “కిషన్ కన్నయ్య” 1937లో విడుదల కావడం ఒక ప్రధాన అంశంగా తీసుకోవాలి. సామాజిక అంశాలతో కూడిన ఫామిలీ డ్రామాల కేంద్రంగా 1940ల్లో భారతీయ సినిమా స్వర్ణ యుగం ప్రారంభం అయ్యింది. ప్రపంచ సినీ ప్రభావంతో భారతీయ బాలీవుడ్ సినిమా కొత్త పుంతలు తొక్కుతూ, టెక్నాలజీని ఒంటపట్టించుకొని అద్భుతాలు తెరపై చూపిస్తూ బాలీవుడ్ సినీ పరిశ్రమ ఉజ్వలంగా ముందుకు సాగుతోంది. 1990ల తర్వాత పూర్వపు సినీ పరిశ్రమ నూతన రంగురంగుల కాస్ట్యూమ్స్, అద్భుత సంగీత సరాగాలు, ఉద్విగ్నభరిత కథ గమనాలతో “న్యూ బాలీవుడ” రంగులు పూసుకొని దేశ సరిహద్దులను చెరిపివేస్తూ ప్రపంచ మానవాళి ఇంటిలో, వారి మనసుల్లో తిష్ట వేస్తున్నది.

**ప్రపంచ బాక్స్ ఆఫీస్‌లను బద్దలు కొడుతున్న బాలీవుడ్ సినిమా:**

నాటి బాలీవుడ్ సినిమాలు షోలే, దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే, ముగల్- ఈ- ఆజామ్, త్రీ-ఈడియట్స్ లాంటి సినిమాలు ప్రపంచ బాక్స్ ఆఫీస్‌లను సహితం బద్దలు కొట్టడం జరిగిపోయింది. బాలీవుడ్ సినిమాల్లో అత్యంత పొడవైన సినిమాగా “ఎల్ఓసి కార్గిల్” సినిమా (గంటలు 4.15 నిమిషాలు) నిలిచింది. నేడు ప్రతి ఏట బాలీవుడ్ పరిశ్రమ నుంచి దాదాపు 1,000 సినిమాలు నిర్మితం అవుతున్నాయి. అన్ని భాషల్లో కలిపి భారతీయ సినీ పరిశ్రమ ద్వారా ఏడాదికి 3,000 సినిమాలు విడుదలై దాదాపు 10,000 సినీ థియేటర్లలో ప్రదర్శిస్తాం అవుతున్నాయి. ప్రపంచ బాలీవుడ్ దినోత్సవ వేదికగా మన సినీ పరిశ్రమ కీర్తిని చర్చించుకోవడం, పైరసీ సమస్యను కట్టడి చేయడం, మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా సినిమాలు తీయడం, డిజిటల్ యుగపు యువత దృష్టిని ఆకట్టుకోవడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరగాలి. వాణిజ్యపరమైన సినిమాలతో పాటు మన పునాదుల ఆధారంగా సంస్కృతి వారసత్వాలు ఉట్టిపడే విధంగా సినిమాలు తీయడం సమాంతరంగా కొనసాగాలి.

సినిమా ఒక వినోదం మాత్రమే కాదని, ఆ పరిశ్రమ ద్వారా మన కళలను కాపాడుకోవడం, సంస్కృతులను రేపటి తరానికి పరిచయం చేయడం, ఆ కథల నుంచి స్ఫూర్తిని పొందడం జరగాలి. నేడు ఓటిటి వేదికలు రావడం, గ్రాఫిక్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఒక అతి పెద్ద ప్రజాదరణ పొందిన పరిశ్రమగా కొనసాగుతున్నది. భిన్న భాషల భారతంలో అనేక సినిమాలు విడుదల అవుతూ మనకు తెలియకుండానే మన సామాజిక జీవన విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. నేటి సినిమాలు మన సంస్కృతికి అద్దం పడుతూ, కళలను పోషిస్తూ, కథలతో కట్టిపడేస్తూ, పరిమిత స్థాయిలో పాశ్చాత్య రంగులను పులుముకుంటూ ముందుకు సాగాలని కోరుకుందాం.

**లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**



# తుమ్మలగుంటలో శాస్త్రోక్తంగా చక్రస్నానం





- పుణ్యస్నానం ఆచరించిన చెవిరెడ్డి దంపతులు
- పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగిసిన కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- చక్రస్నానంను తిలకించడానికి వచ్చి పుష్కరణికి నమస్కరిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి
- పుష్కరణి వద్ద స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

**తిరుపతి: తుమ్మలగుంట వార్తలు 23:** శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించిన చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజావరోహణంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల చివరి రోజు ఉదయం ఆలయ సమీపంలోని పుష్కరిణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకన్నకు, సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజన సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. చక్రతాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించిన అనంతరం భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి గోవింద నామస్మరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక



ధర్మకర్త, ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులతో పాటు వారి కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

**లోక సంక్షేమం కోసం చక్రస్నానం**

తొమ్మిది రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వెన్నంటి ఉండి అన్ని వాహన సేవలు, క్రతువులు విజయవంతంగా నిర్వహించిన చక్రతాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీ. లోక సంక్షేమం, భక్తుల సుఖశాంతులను ఆకాంక్షిస్తూ ఈ పవిత్ర క్రతువును నిర్వహించారు. రాత్రి తిరుచ్చి వాహనంపై శ్రీ కల్యాణ వెంకన్న, చక్రతాళ్వార్ విహరించారు. అనంతరం యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించి, కుంభజలంతో గర్భాలయంలో సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ధ్వజావరోహణం నిర్వహించడంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు సంపూర్ణమయ్యాయి.

**అందరి సహకారంతో విజయవంతం**

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకన్న నవరాత్రి బ్రహ్మోత్సవాలు గ్రామస్తులు, భక్తులు, ప్రజలు, ఆలయ సిబ్బంది, అధికారుల సహకారంతో విజయవంతంగా ముగిశాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ మాజీ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మోమిడిలో వ్యతిరేకత హోరు.. సిలికా మైనింగ్ మాకొద్దు!

- ససేమిరా అంటున్న చిల్లకూరు మండలం మోమిడి గ్రామస్తులు
- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు.. దెబ్బతింటున్న రైతాంగం
- ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టం చేసిన స్థానికులు

**నెల్లూరు ( వార్తలు ):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని సర్వే నంబర్ 696 పరిధిలో 8.693 హెక్టార్ల లీజు స్థలంలో ‘సప్తగిరి మినరల్స్’ ఆధ్వర్యంలో ఓపెన్ కాస్ట్ పద్ధతిలో సాలీన 80,567 టన్నుల సిలికా ఇసుక మైనింగ్ చేపట్టేందుకు తలపెట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభ బుధవారం తీవ్ర నిరసనల మధ్య ముగిసింది. “మా ప్రాంతంలో సిలికా త్రవ్వకాలు వద్దు.. ప్రాణాలైనా ఇస్తాం కానీ మైనింగ్ జరగనివ్వం” అంటూ పలువురు గ్రామస్తులు ముక్తకంఠంతో తేల్చిచెప్పారు.

**నీటి జాడ లేక.. నిలువునా నష్టపోతున్న రైతులు**

గత పదేళ్లుగా ఈ ప్రాంతంలో సిలికా మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పలు సిలికా పరిశ్రమల నిర్వాహకులు ఎక్కడా ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, ఇష్టానుసారం త్రవ్వకాలు జరపడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయని వాపోయారు. “ఒకప్పుడు రెండు పంటలు పండించిన మా నేలల్లో, నేడు నాలుగైదు బోర్లు వేసినా చుక్క నీరు పడటం లేదు. తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం” అంటూ స్థానికులు అధికారుల ఎదుట వాపోయారు.

**రికార్డుల తారుమారుపై అనుమానాలు**

రిజర్వుడు అటవీ పోరంబోకుగా ఉండాల్సిన ఈ భూముల్లో మైనింగ్ చేసుకొనేందుకు రెవెన్యూ శాఖ తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చిందంటూ గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఆన్‌లైన్‌లో రిజర్వుడ్ ఫారెస్ట్‌గా ఉన్న ఈ భూములు రెవెన్యూ రికార్డులలో ఎలా మారుతాయి అంటూ వారు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి, ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయవద్దని డిమాండ్ చేశారు. ఒకవేళ మైనింగ్‌కు అనుమతిలిస్తే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని, సుప్రీంకోర్టుతో పాటు గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. మరోవైపు, ఈ ప్రజాభిప్రాయ సేకరణకు వాకాడు మండలానికి చెందిన ఓ ప్రముఖ బీజేపీ నేత హాజరుకావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**ప్రభుత్వానికి నివేదిస్తాం: జాయింట్ కలెక్టర్**

ప్రజాభిప్రాయ సేకరణ సభ అనంతరం నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే నెల క్రితం ప్రకటన ఇవ్వడం జరిగిందని తెలిపారు. నేటి సభలో గ్రామస్తులు వెలిబుచ్చిన అభిప్రాయాలు, అభ్యంతరాలన్నింటినీ రికార్డు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని, తదనుగుణంగా తదుపరి చర్యలు




ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు పర్యావరణ శాఖ ఈఈ అశోక్ కుమార్, గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, చిల్లకూరు తహసిల్దార్ గోపీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎండి కాలనీ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు..





- పూజా కార్యక్రమానికిహాజరైన కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్

**తిమ్మాపూర్ మండలం:** మహాత్మా నగర్ గ్రామ పరిధిలోని ఎల్ఎండి కాలనీలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలతో కాలనీ అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. నవరాత్రి వేడుకల్లో భాగంగా కాలనీలో సామూహిక కుంకుమార్చనలు, గణనాథునికి నిత్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న ప్రసాద వితరణలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు యువతను, చిన్నారులను ఎంతగానో అలరించాయి. శివాజీ యూత్ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు వినాయక నవరాత్రి ఉత్సవాల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విఘ్నేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ, మహాత్మానగర్ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివాజీ సేన యూత్ బాధ్యులు, బీజేవైఎం నాయకులు దుర్శేటి అజయ్, కుంట మల్ల ప్రేమ్ చాంద్, కూర శివారెడ్డి, అక్షయ్‌తో పాటు మహాత్మా నగర్ గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధవటంలో పోషణ మాసంపై అవగాహన



**సిద్ధవటం సెప్టెంబర్ 23 (వార్తలు ప్రతినిధి):** సిద్ధవటంలోని 6,8 వార్డుల అంగన్వాడీ కేంద్రాల్లో ‘పోషణ మాసం-2026..మన అంగన్వాడీ-మన బాధ్యత’ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడప అర్బన్ ఐసిడిఎస్ ఇంచార్జ్ సీడీపీవో ఎం.సుగుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్లు దీప,శ్రీవిద్య పాల్గొని పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, ఆహార వైవిధ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు,ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు.

ఆరేళ్లలోపు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సముద్ర భారతం - సాధికారతతో కూడిన ప్రగతి
## (24 సెప్టెంబర్ “ప్రపంచ సముద్ర దినోత్సవం” సందర్భంగా)

భారత దేశ నలుమూల 7,517 కిమీ విస్తీర్ణంతో సముద్ర తీరం ఉన్నది. మానవ, వస్తు రవాణా రంగంలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న సముద్రాల ద్వారా ఇతర దేశాలతో సంబంధాలు కూడా నెలకొంటున్నాయి. సముద్ర ఆధార పరిశ్రమలు, ఓడ రేవులు, సముద్ర భద్రత, పర్యావరణ పరిరక్షణ, సముద్ర ఆహారం, సముద్ర ఆధార ప్రజాజీవనాలు లాంటి ప్రయోజనాలను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 24 సెప్టెంబర్ రోజున “ప్రపంచ సముద్ర దినోత్సవం” లేదా “వరల్డ్ మారిటైమ్ డే”ను పాటించుట ఆనవాయితీగా మారింది. విశ్వవ్యాప్తంగా సముద్ర ఉపరితల ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ సముద్ర సంస్థ, ఐఎంఓ ప్రతి ఏట దీనిని నిర్వహించుట కొనసాగుతున్నది. సముద్రయాన రవాణకు సాంకేతిక రంగులు అద్దడం, నూతన ఆవిష్కరణలు చేయడం, సమబమధిత మౌళిక సదుపాయాలను కల్పించడం, భద్రతను పటిష్టం చేయడం, అంతర్జాతీయ సహకారంతో సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయడం లాంటి అంశాలను లోతుగా చర్చించడం జరుగుతుంది.

**2026 ప్రపంచ సముద్ర దినోత్సవ ఇతివృత్తం:**

ప్రపంచ సముద్ర దినోత్సవం-2026 ఇతివృత్తంగా “విధానం నుంచి ఆచరణ వరకు : సముద్రయాన శ్రేష్టతకు శక్తిని ఇవ్వడం” అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 80 శాతం వరకు సరుకులు, మానవ రవాణా సముద్ర ఉపరితలం మీదుగానే జరుగుతూ దేశాల ఆర్థికాభివృద్ధికి ఊతం ఇస్తున్నాయి. సముద్ర రంగం మిలియన్ల ఉద్యోగాలకు నెలవుగా మారింది. మిలియన్ల కుటుంబాలు సముద్ర ఆహారమే తమ జీవనోపాధిగా బతుకులు కొనసాగిస్తూ ఉన్నారు. సముద్రాలు భూగోళ వాతావరణ సానుకూల మార్పులకు దోహదపడుతున్నారు. ప్రతికూల వాతావరణ మార్పులను తగ్గించడంలో కూడా సముద్రాలు దోహదపడుతున్నాయి.

**భారత జాతీయ సముద్ర దినోత్సవ చరిత్ర, ప్రాముఖ్యత:**

05 ఏప్రిల్ 1919న ఎస్. ఎస్. లాయల్టీ చొరవతో ముంబాయి నుంచి లండన్ వరకు నౌకాయానం చేస్తూ చరిత్ర సృష్టించగా, ఆ చారిత్రక సముద్రయానానికి గుర్తుగా జాతీయ సముద్ర దినోత్సవాన్ని ప్రారంభించగా, 05 ఏప్రిల్ 1964 నుంచి భారత ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహించడం జరుగుతోందని మరచిపోరాదు. భారత దేశంలో 13 ప్రధాన ఓడరేవులు, 200 సాధారణ ఓడ రేవులు ద్వారా సాలీనా 1,200 మిలియన్ టన్నుల సరుకుల రవాణా జరుగుతూ, 5 శాతం భారత జిడిపి సాధిస్తూ, దాదాపు 690 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తున్నది. నేడు సముద్ర ఆధార రంగాల్లో 14 మిలియన్లకు పైగా ఉద్యోగులు సేవలు అందించడం జరుగుతున్నది.

ప్రపంచ సముద్ర దినం సందర్భంగా సముద్ర రంగం పట్ల అవగాహన కల్పించడం, యువతను సముద్ర రంగ ఉద్యోగాల వైపు ఆకర్షించడం, సుస్థిర షిప్పింగ్ నెలకొల్పడం, సముద్రయానం చేస్తున్న ఉత్సాహవంతులైన నావికులను గుర్తించడం, భారత సముద్ర రంగాన్ని పటిష్ట పర్చుకోవడం, విద్యాలయాల్లో సముద్ర రంగ అంశాల పట్ల పోటీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం కొనసాగుతున్నది. సముద్ర ఉపరితల ప్రాధాన్యాల ఆధారంగా ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-30కి చెందిన సముద్ర గర్భంలో జీవనం, వాతావరణ మార్పుల చర్యలు, పరిశ్రమలు/నూతన ఆవిష్కరణలు/మౌళికవనరులు, అంతర్జాతీయ భాగస్వామ్యం లాంటివని కూడా సాధించుట సుసాధ్యం అవుతున్నది.

**మధుపాళీ**
**9949700037**

నిజాయితీ - నిష్పాక్షికత
వార్తలు
దిన పత్రిక

గురువారం, సెప్టెంబర్ 24, 2026



# బతుకు బడి

తెల్లని ఉప్పు వలె జీవించు..
ఎవరూ ఎక్కువగా వాడుకోలేరు
పూర్తిగా దూరం కూడా పెట్టలేరు
ఆచితూచి వాడుకుంటారు !
బడిలో నేర్పిన పాఠాలకు సెలబస్ ఉంది
బతుకు నేర్పిన పాఠాలను పరిమితి లేదు
పాఠం చెప్పి పరీక్ష పెడతంది పాఠశాల
పరీక్ష పెట్టి పాఠం నేర్పుతుంది బతుకు బడి !

భవిష్యవాణి కోసం పంజరంలో..
బంధించబడుతుంది రామచిలుక
నల్లని కాకిని ఎవరూ పట్టించుకోరు
స్వేచ్ఛగా, సరదాగా ఎగురుతుంది
శ్మశానంలో కాకికి మరీ దండం పెట్టి...
పంచభక్షపరమాన్నాలు వడ్డిస్తారు..
అందమైన చిలుకకే కదా బాధలు
కాకి అదృష్టం రామచిలుకకు ఎక్కడ !

ఒంటరిగా కూర్చుని ఓ ప్రశ్న వేసుకో..
నీవు పోయిన పిమ్మట ఎవరు..
నిన్ను గుర్తించుకొని కన్నీళ్లు కారుస్తారు
పెద్ద కర్మతో నీవు చేసిన కర్మల్ని మరిచి..
నీ ఆస్తిని ముక్కలు ముక్కలుగా చేసి..
కాలు మీద కాలు వేసుకుని అనుభవిస్తారు
ఇదే కదా మనం కూడా చేసింది, చేస్తున్నది !

మధుపాళీ
9948700037



# నవభారత నిర్మాణంలో యువశక్తి

(సెప్టెంబర్ 24 ఎన్ ఎస్ ఎస్ 57వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా )

ఒక ఆలోచనను తీసుకోండి. ఆ ఆలోచననే మీ జీవితంగా చేసుకోండి. దాని గురించే ఆలోచించండి. దాని గురించే కలలు కనండి. ఆ ఆలోచనతోనే బతకండి .మీ మెదడు కండరాలు నరాలు మీ శరీరంలో ప్రతి భాగం ఆ ఆలోచనతో నిండిపోనివ్వండి. ఇదే విజయానికి మార్గం.

స్వామి వివేకానంద

**నేను కాదు నువ్వు**

(Not Me But you) అనే అమూల్యమైన నినాదంతో నిరంతరం సమాజ సేవలో తరిస్తూ దేశ నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న విద్యార్థిలోకానికి ప్రతీక జాతీయ సేవా పథకం. మహాత్మా గాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 24న ఎన్ ఎస్ ఎస్ ప్రారంభమైంది. దేశములోని 771 యూనివర్సిటీల్లో 42 000 పైగా ఎన్ ఎస్ ఎస్ యూనిట్లు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి.

**యువత నాయకత్వం**

ఎన్ ఎస్ ఎస్ యువతలో సామాజిక బాధ్యతను నాయకత్వ లక్షణాలు పెంపొందించే అద్భుత వేదికగా నిలవడం గమనార్హం. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24న తేదీ దేశవ్యాప్తంగాఎన్ ఎస్ ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుతారు.

**2026 సంవత్సరం ప్రత్యేక ప్రాధాన్యత థీమ్**

ఈ ఏడాది 2026 లోఎన్ ఎస్ ఎస్ తన సేవా కార్యక్రమాలను సరికొత్త లక్ష్యంతో ముందుకు తీసుకువెళ్తుంది. ప్రస్తుత సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్యపై యువతను చైతన్యపరచడానికి వికసిత భారత్ కోసం వ్యసన ముక్త యువత( ఛ్మింష్ఘు వీబన్ష్ఘు ఎబఖ్ఘు జఖనెంట్ ధ్ఘుత్ఘ్ఫ్త) అనే జాతీయ సంకల్పంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించ వలసిన యువశక్తి మత్తుపదార్థాల డిజిటల్ వ్యసనాల బారిన పడకుండా కాపాడుకోవడమే ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం .

**నా ఆరోగ్యం నా గర్వం ఫిట్**

యువత వ్యసన రహిత యువత వారోత్సవాలు నిర్వహిస్తారు.

ఇందులో భాగంగా నా ఆరోగ్యం నా గర్వం ఫిట్ యువత మిషనరీ అయితే యువత కొరకు 12 వారాల ప్రత్యేక కార్యచరణను దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఎస్ఎస్ యూనిట్లలో వాలంటీర్లు ఊరేగింపుల ద్వారా సదస్సుల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్తారు.

**పర్యావరణ పరిరక్షణలో యువత**

గ్లోబల్ వార్మింగ్ పర్యావరణ కాలుష్యం ప్రపంచాన్ని అతలాకుతం చేస్తున్నాయి. ఇటువంటి తరుణంలో పర్యావరణాన్ని కాపాడడంలో యువత పాత్ర చాలా కీలకం. పర్యావరణాన్ని కాపాడడంలో యువత పాత్ర చాలా కీలకం. కేవలం మొక్కలు నాటడం కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతలు కూడా తీసుకుంటున్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రచారం చేయడం

సదస్సులు సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరిచే శక్తి ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు. జలవనరుల సంరక్షణ సహజవనరుల సంరక్షణ వర్షపు నీటి గుంతలు ఏర్పాటుమరియు పునరుత్పాదక ఇంధన వనరులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడం. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మూఢవిశ్వాసాల పట్ల ప్రజా చైతన్యం అవగాహన కలిగించడంలో యువత అగ్రభాగాన నిలుస్తుంది.

**ప్రాణదాతలుగా యువత రక్తదానం**

రక్తదానం ప్రాణదానంతో సమానం. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్య పరిస్థితిలోనూ రక్తం దొరక్కపోతే ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎన్ ఎస్ ఎస్ నిరంతరం రక్తదాన శిబిరాలను నిర్వహిస్తుంది. రక్త దానం పై అపోహలు వీడండి ప్రాణదాతలుగా నిలవండి అంటూ తోటి విద్యార్థులను ప్రజలను చైతన్య పరుస్తూ తాము స్వయంగా రక్తదానం చేస్తూ లక్షలాదిమంది కి పునర్జన్మను ప్రసాదిస్తున్నారు.

**ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆపద్బాంధవులు**

వరదలు భూకంపాలు తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రభుత్వం యంత్రాంగంతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (యువశక్తి) రంగంలోకి దిగుతుంది. ప్రాణాలకు తెగించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పునరావాస శిబిరాల్లో ఆహారము మందులు పంపిణీ చేయడం ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టడం .అంటు వ్యాధులు తగలకుండా చూడటం వాలంటీర్లు చూపించే చొరవ ప్రశంసనీయం. విపత్కర పరిస్థితుల్లో వారు అందించే సేవలు బాధితులకు కొండంత ధైర్యాన్ని ఇస్తాయి.

**ఎన్ ఎస్ ఎస్ చిహ్నం**

ఒడిస్సా లోని సూర్య దేవాలయ రథ చక్రం ఆధారంగా ఎన్ఎస్ఎస్ లోగో ని రూపొందించారు. ఈ చక్రం నిరంతరం చలనానికి ప్రగతికి సంకేతం. చక్రంలోని 24 ఆకులు రోజులు 24 గంటలు సూచిస్తూ దేశ సేవ కోసం వాలంటీర్లు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని చాటి చెబుతుంది. ఇందులో నీలింరంగు విశ్వవ్యాప్తమైన సేవను ఎరుపు రంగు యువతలోని రక్తం ఉత్సాహంమరియు త్యాగ నిరతిని తెలియజేస్తాయి. యువత కేవలం రేపటి పౌరులు మాత్రమే కాదు .నేటి సమాజానికి నైతిక దీపాలు .పట్టుదల ఆత్మవిశ్వాసం సేవాభావం ఉన్న యువతతోనే సగర్వ వికసిత భారత్ సాధ్యమవుతుంది.

**అంతర్జాతీయ యువజన మార్పిడి కార్యక్రమాలు**

జాతీయ సేవా పథకం అంతర్జాతీయ స్థాయిలో కూడా శాంతి సాంస్కృతిక మార్పిడి మరియు ప్రపంచ ప్రగతి కోసం విశేషమైన సేవలు అందిస్తుంది. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను చాటుతున్నారు. స్నేహపూర్వక దేశాలైన) చైనా రష్యా దక్షిణ కొరియా వియత్నాం ఆఫ్రికా దేశాల్లో) భారతదేశం జరిపే ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆయాదేశాలు పర్యటిస్తున్నారు. భారతీయ సంప్రదాయాలను సామాజిక సేవ పద్ధతులను ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తారు.

**ప్రపంచ శాంతి**

అవగాహన వివిధ దేశాల యువతతో కలిసి అంతర్జాతీయ సమస్యలపై (వాతావరణ మార్పు పేదరికం ) మొదలగు సమస్యలపై చర్చలు జరిపి పరస్పర అవగాహన మరియు ప్రపంచ శాంతిని పెంపొందించడంలో భాగస్వాములు అవుతున్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలైన యునైటెడ్ నేషన్స్ వాలంటీర్స్ తో కలిసి భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎన్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద యువజన విభాగంగా గుర్తింపు పొందింది.

**ఆరోగ్యం పరిశుభ్రత**

అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వంటి సమయాల్లో ప్రపంచవ్యాప్త అవగాహన ఉద్యమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు భాగస్వాములు అవుతున్నారు. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులోయ్. వెనుకబడిన వారు వెనుకబడిన వారు వెనుకనే ఉంటే దేశమే గతి బాగుపడునోయ్ పొరుగు వారికి తోడ్పడవోయ్

**వట్టి మాటలు కట్టిపెట్టి**

**గట్టి మేలు తలపెట్టవోయ్. గురజాడ అప్పారావు**

యువత విదార్థి లోకం స్వామి వివేకానంద మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా స్వార్థాన్ని వీడి సమాజ శ్రేయస్సు కు సమాజ వికాసానికి పాటుపడతామని ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ఎన్ ఎస్ ఎస్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలి.

**సేవయే మార్గంగా దేశ ప్రగతియే**

లక్ష్యంగా మత్తును వీడుదాం. ప్రగతి బాట నడుద్దాం. వ్యసన ముక్త భారతాన్ని నిర్మిద్దామని ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ప్రతిజ్ఞ చేయాలి.

**నేదునూరి కనకయ్య**
**మాజీ ఎన్ ఎస్ ఎస్ అధికారి**
**(ఇందిరాగాంధీ ఎన్ ఎస్ ఎస్**
**బెస్ట్ యూనిట్ అవార్డ్**
**గ్రహీత)**
**అధ్యక్షులు తెలంగాణ**
**ఎకనామిక్ ఫోరం**
**కరీంనగర్9440245771**




# గురుకులాశ్రమ సంఘం

## సర్దార్ నగర్ సిరిసిల్ల గణపతి మండపం



లోకాలనేలే ఓ గణపయ్య

లోకాలనేలే ఓ గణపయ్య
ఈ జగమంతా నీవే కదయ్యా
అందుకో మా పూజలు ఓ గణపయ్య
ఈ పులిహోర నీకే
ఉండ్రాళ్లు నీకే నయ్యా
విఘ్నాలు తొలగించు తండ్రి
విజ్ఞాన దీపం వెలిగించు స్వామి

ముల్లోకాలకు మూలస్తంభం నీవే
మనసులోని భయం మాపే దైవం నీవే
బొజ్జ నిండా కోరికలన్నీ
కరుణా కటాక్షంతో కాపాడు మమ్ములను
ఏకదంతా, వక్రతుండ, గజాననా
ఈ భక్తుల మనవి వినవయ్యా
పసుపు కుంకుమల పూజలు స్వీకరించు
ఆవపిండి వాసన పులిహోర అందుకో
బియ్యం శనగల ఉండ్రాళ్ల రుచి
భక్తితో పెట్టిన నైవేద్యం స్వీకరించు

నవరాత్రుల నాడు నీ పేరు జపిస్తూ
నిత్యం హారతులు ఇస్తూ ఉంటాము
తప్పులు చేస్తే మన్నించు తండ్రీ
తలపెట్టిన పనులు సఫలం చేయయ్యా
లోకాలనేలే ఓ గణపయ్య
ఈ జగమంతా నీవే కదయ్యా

చిటికెన కిరణ్ కుమార్
సెల్: 9490841284

# దేవుడా! కాపాడు!



ఒక వ్యాపారస్తుడు తన పనివాడితో ఎడ్లబండి మీదా అమ్మవలసిన సరుకులు వేసుకుని పొరుగూరిలోని సంతకి బయలుద్యారాడు. దారి సరిగ్గా లేదు. చాలా గోతులు, గుంటలు వున్నాయి. వాన మూలంగా వాటిల్లో నీళ్ళు నిలిచి పోయాయి. జాగ్రత్త గా, నిదానంగా బండి తోలుకుంటూ కొనసాగారు. అందు మూలంగా అనుకున్నంత వేగంగా వెళ్ళలేక పోతున్నారు. ఇలా ఆలస్యం అయితే కొట్టు పెట్టుకోవడానికి మంచి చోటు దొరకక పోవచ్చని, సంతలో లాభం తగ్గిపోతుందేమో అని వ్యాపారస్తుడు చాలా దిగులుగా వున్నాడు. ఉన్న కష్టాలు సరిపోవు అన్నట్టు హటాత్తుగా బండికున్న ఒక చక్రం గుంటలో దిగి మట్టిలో ఇరుక్కు పోయింది. వ్యాపారస్తుడు ఎద్దులని ముందుకు నెట్టిన కొద్ది చక్రం ఇంకా ఇంకా కూరుకుపోతోంది. ఉన్న సమయం తక్కువ. మధ్యలో ఈ గొడవ. వ్యాపారస్తుడు చేతులు జోడించి మనసంతా పెట్టి దేవుడిని ప్రార్థించాడు. “దేవుడా! ఎలాగైనా ఈ ఆపాద నుంచి కాపాడు తండ్రి!” అని మొక్కుకున్నాడు. దేవుడు ప్రత్యక్షం అయ్యాడు. “ప్రతి చిన్న దానికి నన్ను తలుచు కోవడం ఎందుకు? నువ్వు బండి మీద కూర్చుని సమస్య అదే తీరిపోవాలంటే ఎలా కుదురుతుంది? ఒకళ్ళు దిగి మట్టిలోంచి చక్రం తోయ్యండి, మరొకరు చిన్నగా ఎడ్లని ముందుకు తోలండి.” అని సలహా ఇచ్చి అదృశ్యం అయిపోయాడు.

# ఎలుగుబంటి చెప్పిన రహస్యం

ఇద్దరు మిత్రులు జీవనోపాధి కోసం పొరుగూరికి ప్రయాణం చేయాలని నిశ్చయించుకున్నారు. కాని దారిలో ఒక అడవి వస్తుంది. అది దాటితేకాని పొరుగూరికి చేర లేరు.




అడవిలో రక రకాల జంతువులు ఉంటాయని వారికి తెలుసు. అందుకే ఏ జంతువు ఎదురైనా దాన్ని ఇద్దరూ కలిసి ఎదిరించాలని ఒప్పందం చేసుకున్నారు. అనుకున్న ప్రకారం మొన్నాడు పొరుగూరికి బయలుద్యారారు. అలాగే అడవిలోకి ప్రవేశించారు. గట్టిగా ఒకళ్ళ చేతులు మరొకరు పట్టుకుని భయం భయంగా నడుచుకుంటూ అడవి దాటుతుంటే, హటాత్తుగా ఒక ఎలుగుబంటి కనిపించింది.

# రన్నర్స్ డయేరియా అంటే ఏమిటి.. ఇది ఎందుకు వస్తుంది.. ఏం చేయాలి..?

తీవ్రమైన వ్యాయామం లేదా పరుగు సమయంలో అకస్మాత్తుగా మల విసర్జనకు వెళ్లాలనే తొందర, కడుపులో నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు కొందరు క్రీడాకారుల్లో కనిపిస్తాయి. ఇటీవల బీజింగ్‌లో జరిగిన హైరోక్స్ పోటీలో ఆస్ట్రేలియాకు చెందిన క్రీడాకారిణి జొవానా వియెట్జిక్‌కు పరుగు మధ్యలో మల నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు రావడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఆమె ఆ తర్వాత కూడా కొంతసేపు పోటీలో కొనసాగినట్లు సమాచారం. ఈ ఘటనతో ఇతర క్రీడాకారులు, ప్రేక్షకుల ఆరోగ్యం, పోటీ ప్రాంగణంలో పరిశుభ్రత వంటి అంశాలపై ప్రశ్నలు తలెత్తాయి. వ్యాయామం సమయంలో వచ్చే జీర్ణవ్యవస్థ సమస్యలు అంటువ్యాధి కారణంగా మాత్రమే వస్తాయని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు.

**రన్నర్స్ డయేరియా అంటే..**

పరుగు సమయంలో వచ్చే విరేచనాలు, కడుపు మంట లేదా మల విసర్జనకు తీవ్రమైన తొందరను రన్నర్స్ డయేరియాగా పిలుస్తారు. ఎక్కువసేపు లేదా అధిక తీవ్రతతో వ్యాయామం చేయడం, శరీరంలో నీరు తగ్గిపోవడం, వేడి, ఆందోళన, వ్యాయామానికి ముందు తీసుకునే కొన్ని ఆహారాలు, పానీయాలు ఇందుకు కారణం అవుతాయి. తీవ్రమైన వ్యాయామ సమయంలో శరీరం పనిచేస్తున్న కండరాలు, గుండె, ఊపిరితిత్తులకు ఎక్కువ రక్తాన్ని సరఫరా చేస్తుంది. దీంతో జీర్ణవ్యవస్థకు వెళ్లే రక్తప్రసరణ తాత్కాలికంగా తగ్గుతుంది. పరుగు సమయంలో శరీరానికి పదేపదే కలిగే కుదుపులు, వ్యాయామ తీవ్రతలో ఆకస్మిక



మార్పులు కూడా పేగుల కదలికలను పెంచి మల విసర్జనకు తొందర కలిగిస్తాయి. అయితే వ్యాయామం తర్వాత వచ్చే ప్రతి విరేచనాన్ని కేవలం వ్యాయామం వల్లేనని భావించకూడదు.

**పరిశుభ్రత సమస్యలు వచ్చే చాన్స్..**

పెద్ద స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో అనేక మంది ఒకే ప్రాంగణం, వ్యాయామ పరికరాలు, నీటి కేంద్రాలు, ఇతర సౌకర్యాలను ఉపయోగిస్తారు. మల పదార్థం సామూహికంగా ఉపయోగించే ప్రదేశంలో పడితే పరిశుభ్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అయితే వ్యాయామం వల్ల వచ్చే మల విసర్జన సమస్యకు, అంటువ్యాధి వల్ల వచ్చే విరేచనాలకు తేడా ఉంది. కలుషితమైన ఆహారం లేదా నీరు, సరైన చేతుల పరిశుభ్రత పాటించకపోవడం వల్ల కూడా విరేచనాలు, వాంతులు వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల పోటీల్లో ఆహారం, నీటిని జాగ్రత్తగా ఎంచుకోవడం, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఇతరులతో సీసాలు లేదా ఆహార పరికరాలను పంచుకోకపోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త..**

వ్యాయామ సమయంలో అప్పుడప్పుడు మల విసర్జనకు తొందర కలగడం తీవ్రమైన సమస్యకు సంకేతం కాదు. కానీ పదేపదే మల నియంత్రణ కోల్పోవడం, వ్యాయామం చేయక పోయినా ఇలాంటి సమస్య రావడం, మలంలో రక్తం కనిపించడం, నిరంతర విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, అధిక జ్వరం,తల తిరగడం, నీరు తగ్గిపోయే లక్షణాలు లేదా బరువు తగ్గడం వంటి సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. పోటీల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకు న్నప్పుడు క్రీడాకారుల ఆరోగ్య పరిస్థితితోపాటు ఇతరుల భద్రత, పరిశుభ్రతను కూడా నిర్వాహకులు పరిగణన లోకి తీసుకోవాలి. కాబట్టి క్రీడాకారులు పోటీకి ముందు కొత్త ఆహారం లేదా పానీయాలను ప్రయత్నించకుండా, శిక్షణ సమయంలో తమ శరీరానికి సరిపడే ఆహారాన్ని గుర్తుంచు కోవడం, తగినంత నీరు తీసుకోవడం, జీర్ణవ్యవస్థకు సంబంధించిన హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకపోవడం మంచిది.

# యాంజియోగ్రామ్ పరీక్ష అంటే ఏమిటి.. దీని వల్ల గుండె సమస్యలు ఎలా తెలుస్తాయి..?

గుండెకు సంబంధించిన సమస్యలను గుర్తించేందుకు యాంజియోగ్రామ్ కీలకమైన పరీక్ష. అయితే యాంజియోగ్రామ్‌లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళాల్లో ఎలాంటి పెద్ద అడ్డంకులు కనిపించలేదని తేలినంత మాత్రాన గుండెకు సంబంధించిన అన్ని సమస్యలు లేవని భావించకూడదు. ముఖ్యంగా మహిళల్లో ఛాతిలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కారణం తెలియని అలసట వంటి లక్షణాలు ఉన్నప్పటికీ యాంజియోగ్రామ్ సాధారణంగా ఉండే సందర్భాలు కనిపిస్తాయి. దీనికి కారణం ప్రధాన రక్తనాళాల్లో కాకుండా గుండెలోని చిన్న రక్తనాళాల్లో సమస్యలు ఉండే అవకాశం ఉంది.మెడికల్ పరీక్షలు బుక్ చేయండి

**గుండెకు రక్త ప్రసరణ తగ్గితే..**

గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ప్రధాన రక్తనాళాలను పెద్ద రహదారులతో పోలిస్తే, వాటి నుంచి విడిపోయే చిన్న రక్తనాళాలు చిన్న దారుల్లాంటివి. యాంజియోగ్రామ్ ప్రధాన రక్తనాళాల్లోని అడ్డంకులను స్పష్టంగా చూపిస్తుంది. అయితే గుండెకు ఎక్కువ ఆక్సిజన్ అవసరమైన సమయంలో ఈ చిన్న రక్తనాళాలు తగినంతగా విస్తరించవు. కొన్నిసార్లు రక్తనాళాలు తాత్కాలికంగా సంకోచించడం వల్ల కూడా గుండెకు రక్తప్రసరణ తగ్గుతుంది. దీనిని సూక్ష్మ రక్తనాళాల పనితీరులో లోపంగా పేర్కొంటారు. ప్రధాన రక్తనాళాల్లో పెద్ద అడ్డంకులు లేకపోయినా గుండెకు రక్తప్రసరణ సరిగా జరగని పరిస్థితిని ఐనోకాగా పిలుస్తారు. ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది.

**లక్షణాలు ఎలా ఉంటాయి..**

మహిళల్లో గుండె సమస్యల లక్షణాలు ప్రతిసారీ ఛాతినొప్పి రూపంలోనే కనిపించవు. నడిచేటప్పుడు లేదా మెట్లు ఎక్కేటప్పుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణమైన అలసట, ఛాతిలో ఒత్తిడి, వీపు, భుజం, దవడ లేదా పై పొత్తికడుపులో అసౌకర్యం, వికారం, తల తిరగడం, గతంతో పోలిస్తే శారీరక సామర్థ్యం తగ్గడం వంటి లక్షణాలు కూడా కనిపించే వీలు ఉంది. వీటిని చాలాసార్లు ఎసిడిటీ, ఒత్తిడి, నిద్రలేమి, రుతువిరతి లేదా రోజువారీ పనుల వల్ల కలిగే అలసటగా భావించే అవకాశం ఉంది. అయితే ఇలాంటి లక్షణాలు పదేపదే వస్తుంటే లేదా సాధారణ పనులపై ప్రభావం చూపుతుంటే వైద్యులను సంప్రదించడం అవసరం.అనాటమీ పుస్తకాలు



చదవండి

**ఈ సమస్యలు ఉంటే..**


యాంజియోగ్రామ్ సాధారణంగా ఉన్నప్పటికీ గుండెకు సంబంధించిన ప్రమాదాలు పూర్తిగా తొలగిపోయినట్లు కాదు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, పొగతాగడం, కుటుంబంలో చిన్న వయసులోనే గుండెజబ్బుల చరిత్ర వంటి అంశాలు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. మహిళల్లో వయసు పెరుగుతున్న కొద్దీ, ముఖ్యంగా మెనోపాజ్ దశకు చేరుకున్న తర్వాత కొన్ని ప్రమాద కారకాలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటాయి. యాంజియోగ్రామ్ తర్వాత కూడా లక్షణాలు కొనసాగితే చిన్న రక్తనాళాల పనితీరు, రక్తనాళాల సంకోచం వంటి ఇతర కారణాలను వైద్యులు పరిశీలిస్తారు. అవసరాన్ని బట్టి ప్రత్యేక పరీక్షలు చేయించి సరైన కారణాన్ని గుర్తించి చికిత్స అందించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# గుమ్మడికాయ దొంగ



ఒక ఊరిలో రైతులు కష్టపడి పండిస్తున్న గుమ్మడికాయలను ఎవరో దొంగ రోజు దొంగలించేసేవాడు. ఆ రోజులలో గుమ్మడికాయలు ఇప్పుడు దొరికినంత సులువుగా దొరికేవి కాదు. అవి పండించడానికి రైతులు చాలా కష్ట పడే వారు. గుమ్మడికాయ దొంగ ఊళ్లోనే ఎవరో అయ్యి ఉంటారని రైతుల నమ్మకం. దొంగ ఎవరో కనిపెట్టడం ఎలా? అందుకే రైతులంతా కలిసి ఊరి పెద్ద దగ్గరకు వెళ్ళారు. పెద్దాయన చాలా తెలివైన అతను. రైతుల మొర విని, “ఓస్! ఇంతేనా! గుమ్మడికాయ దొంగని పట్టుకోవడం చాలా సులువు. ఆ దొంగకి ఏ భుజం మీదైతే గుమ్మడికాయ మోసుకుని వెళ్ళడం అలవాటో, ఆ భుజం మీద గుమ్మడికాయ అంత సొట్ట వుంటుంది” అన్నాడు. ఈ మాట విన్న వెంటనే రైతులలో ఒకడు తన కుడి భుజం తడుముకుని సొట్ట వుందో లేదో అని పరిశీలించుకున్నాడు. పెద్దాయన వెంటనే ఇది గమనించి, “దొంగ ఇతనే!” అని అందరికి చెప్పారు. “మనం ఏదైనా నేరం చేసినప్పుడు మనకి తప్పు చేసామన్న భావం మనసులో వుంటుంది. అందుకనే ఎవరేమన్నా మనల్నే అంటున్నారేమో అని అపోహ పడతాము” అని వివరించారు.

# నక్క ఆహ్వానం




ఒక రోజు ఒక నక్క తన మిత్రుడైన కొంగను భోజనానికి ఆహ్వానించింది. కొంగ సంతోషంగా ఒప్పుకుంది. సాయంత్రం నక్క భోజనం తయారు చేయడం మొదలు పెట్టింది. నక్కకు అత్యాశ ఎక్కువ. కొంగని భోజనానికి పిలిచింది కాని కొంగ ఎక్కువ తినేస్తుందేమో అని భయం. అందుకనే ఒక ప్లాన్ వేసింది. నిర్దారించుకున్న సమయానికి కొంగ తలుపు తట్టింది. నక్క ఇంట్లోంచి మంచి మంచి వాసనలు వస్తున్నాయి. కొంగకు నోరూరింది. ఇద్దరు మిత్రులు భోజనానికి రెడీ అయ్యారు.

# అడవులే మాకు జీవనాధారం ! పరిశ్రమలు మాకొద్దు!

- **ఫ్యాక్టరీల పేరుతో చిన్న, సన్నకారు రైతులు భూములను లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు**
- **రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకున్న రైతులు**



**రామచంద్రపురం, వార్తలు 23:** రామచంద్రాపురం మండల పరిధిలోని ఉప్పులివంక ప్రాంతంలో ఇండస్ట్రియల్ ఫ్యాక్టరీల ఏర్పాటు కోసం తమ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారంటూ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ లో ఉన్న రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం కానీ నోటీసులు జారీ చేయకుండా తమ పంట పొలాలలో పనులు ప్రారంభించడంపై బుధవారం ఉప్పిలివంక దద్దనంబండ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు...గోకులాపురం చెరువు వద్ద నుండి పనభాకం రహదారి కానుకొని ఉన్న సుమారు



473 ఎకరాల అటవీ, రైతుల అనుభవంలో ఉన్న డీకేటి భూములను ఎలాంటి ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా తహసిల్దార్, పోలీసు సిబ్బందితో కలసి పొలాల్లోకి చొరబడటంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

**ఎలాంటి సమాచారం లేదు**

ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా, పంచాయతీ పరిధిలో గ్రామసభలు నిర్వహించకుండా అధికారులు తమ అనుభవంలో ఉన్న భూములను ఉన్నపలంగా లాక్కుంటున్నారని సమీప గ్రామాల ప్రజలు, బాధిత రైతులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని తమ భూములను కాజేయాలని చూస్తున్నారని, ఉప్పులివంక చుట్టుపక్కల ఉన్న సుమారు ఆరు గ్రామాల ప్రజలు ఈ భూములనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఎకరా, అర్ధ ఎకరా పొలాలతో పాటు పశువులు, గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడిన తమకు ఫ్యాక్టరీల పేరుతో జీవనాధారం లేకుండా చేస్తున్నారని, ఫ్యాక్టరీల పేరుతో పచ్చని ప్రాంతాలను ఛిన్నాభిన్నం చేస్తే భావితరాల భవిష్యత్తు కనుమరుగవుతుందని వాపోయారు. భూముల సర్వేను, అధికారుల చర్యలను వ్యతిరేకిస్తూ బాధిత రైతులు తహశీల్దార్‌ను ప్రశ్నించారు. మాకు ఫ్యాక్టరీలు అక్కర్లేదు.. పంటలు పండించుకుంటూ ప్రశాంతంగా బతుకుతున్నామని తహసిల్దార్ ముందు కన్నీటి పర్యంతమయ్యారు. తమ గోడును పట్టించుకోవాలని మొరపెట్టుకున్న రైతులపై తహసిల్దార్ అక్కసు వెలగక్కారు. తాను ఎవరికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ఇక్కడ హత్యలు చేయడం లేదని, రైతుల మాటలతో పని లేదంటూ ఎవరు ఏమి చెప్పిన పనులు ఆగవంటూ ఆవేశంతో ఊగిపోయారు. అధికారులే తమ బాధను పట్టించుకోకుంటే తాము ఎవరికి చెప్పుకోవాలంటూ బాధితులు విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేకపోతే ఆత్మహత్యలే శరణమంటూ మీడియా ముందు బాధితులు వాపోయారు.

**తాసిల్దార్ వివరణ**

పరిశ్రమలకు రైతుల భూములను ఎక్కడా తీసుకోవడం లేదు ప్రభుత్వం భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కు ప్రతిపాదన పంపిస్తున్నాం గ్యాప్ ఏరియాలో రహదారి ఏర్పాటు చేస్తున్నాం కేవలం ఉన్నతాధికారులు స్థలం పరిశీలనకు అనుకూలంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు

# క్రమశిక్షణ, సేవాభావంతో విధులు నిర్వర్తించాలి




కడప ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



**సిద్ధవటం,సెప్టెంబర్ 23 (వార్తలు ప్రతినిధి):** సిద్ధవటం మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న 548 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు సంబంధించి బుధవారం రిహార్సల్ నిర్వహించారు. ఈ రిహార్సల్‌ను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల పరేడ్ కవాతు, డ్రిల్, మార్చింగ్, కమాండ్లకు అనుగుణంగా స్పందించే విధానం, క్రమశిక్షణ, సమన్వయం తదితర అంశాలను ఎస్పీ నిశితంగా పరిశీలించారు. పరేడ్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరూ పూర్తి క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసంతో తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు.పోలీసు విధుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, బాధ్యత, నిబద్ధత, ప్రజాసేవా భావం ఎంతో ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న నైపుణ్యాలను భవిష్యత్ విధుల్లో సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. పాసింగ్ అవుట్ పరేడ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. పరేడ్ సందర్భంగా భద్రత, క్రమశిక్షణ, కార్యక్రమ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి, కడప డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, పోలీసు సిబ్బంది, శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.




# నేపాల్ వరద బాధితులకు తెల్లాపూర్ వాసుల ఆపన్నహస్తం



- **4,78,973 విరాళం అందజేత**

**రామచంద్రాపురం, వార్తలు:** ఇటీవల నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు, ప్రకృతి విపత్తు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు టెల్లాపూర్ ప్రజలు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ (TeNA) ఆధ్వర్యంలో తెల్లాపూర్‌లోని వివిధ నివాస సముదాయాలు, ప్రజల నుంచి సేకరించిన 4,78,973/- విలువైన చెక్కులను నేడు న్యూఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయం డిప్యూటీ కమిషనర్ డా. సురేంద్ర థాపాకు అందజేశారు. ఈ సందర్భంగా డా. సురేంద్ర థాపా మాట్లాడుతూ, నేపాల్ ప్రజల తరఫున తెల్లాపూర్‌లోని ప్రతి దాతృత్వ హృదయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో స్పందించి బాధితులకు అండగా నిలిచిన తెల్లాపూర్ వాసుల మానవత్వాన్ని ఆయన అభినందించారు. తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి మాట్లాడుతూ ఈ విరాళం కోసం ముందుకు వచ్చిన అన్ని రెసిడెన్షియల్ కమ్యూనిటీలు, దాతలు మరియు నివాసితులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో మానవత్వంతో స్పందించడం, బాధితులకు అండగా నిలవడం తెల్లాపూర్ ప్రజల సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. నేపాల్ ప్రజలకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ తేనా తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 01 పటాన్ చేరు

# జడ గొలుసులు ఇవి!



సిగలో నాలుగు పువ్వులు తురిమి అలంకారం ముగించేకాలం నుంచి వెంట్రుకలను వేయి మాడల్లలో మలిచేదాకా ఫ్యాషన్ ప్రయాణం సాగుతున్నది. జడవేయడంతో పని పూర్తవదు, దాని ముస్తాబులోనే అసలు సంగతి దాగి ఉంది. పూల జడలు అందులో తొలి రకమైతే జడ బిళ్లలు, పూసలు, పువ్వులతో ముస్తాబయ్యే హెయిర్ యాక్సెసరీలు కొనసాగింపులు. ఇప్పుడు కురులకు మరిన్ని సొబగులద్దేలా జడ గొలుసులు... అదేనండీ, 'హెయిర్ చెయిన్'లు వస్తున్నాయి. చిన్న పిల్లల నుంచి యువతుల దాకా ఎవరైనా అవసరాన్ని బట్టి పెట్టుకోగలగడం వీటి ప్రత్యేకత.

**ఎన్నో రకాలు...**

జడను అలంకరించాలి. అలాగని పువ్వులతో కాదు... అనుకున్నప్పుడు పూల అల్లికలు ఉండే క్రోచెట్‌హెయిర్ చెయిన్‌లు చక్కగా నప్పుతాయి. తలపై నుంచి కింది వరకూ జడతో పాటు వీటిని అందంగా అల్లుకోవచ్చు. పూల జడను తలపిస్తూనే ఫ్యాషన్ లుక్‌ని సొంతం చేసుకోవచ్చు. అలా కాకుండా జడ పొడవుగా వేలాడేలా రకరకాల పువ్వులతో తయారయ్యే హెయిర్ స్ట్రింగ్‌లూ దొరుకుతున్నాయి.

# మా బిడ్డను మాకు అప్పగించండి.. అన్యాయపు కేసుల నుంచి రక్షించండి!

- **మనుబోలు మండలం చెర్లోపల్లిలో దళిత కుటుంబం ఆవేదన**



**నెల్లూరు ( వార్తలు ):** సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు మండలం చెర్లోపల్లి దళిత కాలనీకి చెందిన ఓ నిరుపేద కుటుంబం తమకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా ఎస్పీ స్పందించి రక్షించాలని వేడుకుంటోంది. తమ కుమారుడిపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేశారని ఆ కుటుంబం ఆరోపించింది. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులు మరియు గ్రామస్తులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. చెర్లోపల్లి దళిత కాలనీకి చెందిన తలారి దేవానందం, మల్లీశ్వరి దంపతుల కుమారుడు తలారి అభిషేక్ బీటెక్ పూర్తి చేసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. 2021లో గ్రామంలోని గట్టు వద్ద జరిగిన ఒక చిన్న ఘర్షణను మనసులో పెట్టుకుని అప్పటి నుంచి తమ కుమారుడిని లక్ష్యంగా చేసుకుని రకరకాల కేసులు మోపుతున్నారని తల్లిదండ్రులు రోదించారు. 2024లో ప్రభుత్వం మారిన తర్వాత తమ కుమారుడిపై ఏకంగా ఆరు కేసులు పెట్టించారని ఆరోపించారు. గ్రామంలో జరిగిన ఓ దాడి ఘటనకు సంబంధించిన కేసు తుది దశకు చేరుకున్న తరుణంలో, సాక్ష్యం చెప్పవద్దని తమను బెదిరింపులకు గురిచేశారని ఆ హెచ్చరికలను లెక్కచేయకపోవడంతో కక్ష కట్టిన ప్రత్యర్థులు, అధికార బలంతో తమ కుమారుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయించి మూడు నెలలు జైలుకు పంపించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. "జైలు నుంచి బెయిల్ పై విడుదలైన గంటల వ్యవధిలోనే మా కుమారుడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి మళ్లీ కడప జైలుకు తరలించారు. మా బిడ్డపై దాడి చేసిన వారిని వదిలేసి, బాధితుడైన మా కుమారుడిపైనే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని తలారి దేవానందం ఆవేదన వ్యక్తం చేశారు. అధికార బలంతో దళితులపై జరుగుతున్న ఈ దారుణాలకు అడ్డే లేకుండా పోయిందని పలువురు స్థానికులు మండిపడ్డారు. తక్షణమే జిల్లా ఎస్పీ స్పందించి, ఈ కేసులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి న్యాయం చేయాలని, నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి తమ బిడ్డను తమకు అప్పగించాలని వారు కన్నీటి పర్యంతమవుతూ విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

# దళిత యువకుడిపై ఎస్సై దాష్టీకం?



- **స్టేషన్‌కు రమ్మని పిలిచి లాఠీతో కొట్టారంటూ బాధితుడి ఆరోపణ**
- **మొబైల్ లాక్కొని లోపలికి తీసుకెళ్లి దాడి చేశారంటూ ఆవేదన.. ఎస్పీ స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్**

**చిన్నగొట్టిగల్లు: వార్తలు 23** భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో దళిత యువకుడిపై ఎస్సై లాఠీతో దాడి చేశారంటూ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. రెండు నిమిషాల్లో స్టేషన్‌కు వచ్చి వెళ్లాలని పోలీసులు ఫోన్ చేయడంతో ఏం జరిగిందో తెలియక హడావుడిగా స్టేషన్‌కు వెళ్లిన తనపై ఎస్సై చేయిచేసుకున్నారని బాధిత యువకుడు ఆరోపిస్తున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా ఆదివారం డీజే వద్ద హంగామా చేశానంటూ తనపై ఎవరో ఫిర్యాదు చేశారని, ఈ విషయమై బుధవారం మధ్యాహ్నం పోలీసులు ఫోన్ చేసి వెంటనే భాకరాపేట స్టేషన్‌కు రావాలని చెప్పారని తెలిపాడు. దీంతో స్టేషన్‌కు వెళ్లి "సార్.. ఏమైంది? నన్నెందుకు పిలిపించారు?" అని అడిగేలోపే ఎస్సై తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను లాక్కొని లోపలికి తీసుకెళ్లారని ఆరోపించాడు. అనంతరం లాఠీతో తనను కొట్టారని, ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించినా వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా డీజే వద్ద హంగామా చేశావంటూ ఎస్సై దాడి చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తనపై జరిగిన దాడితో తీవ్రంగా భయాందోళనకు గురయ్యానని తెలిపాడు.



**ఎస్పీ దృష్టికి.. విచారణ జరపాలని డిమాండ్**

పోలీసు స్టేషన్‌కు పిలిపించి యువకుడిపై దాడి చేశారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని బాధితుడు, అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ఎస్సైపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలగకుండా ఘటనపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# జోరువానలు.. ఉధృతంగా గోదావరి! చేపల వేటకు వెళ్లొద్దు.

- **మద్దిరత్తిగూడెంలో పోలీసుల అవగాహన కార్యక్రమం.**
- **ప్రజలకు పలు సూచనలు...**

**దేవీపట్నం వార్తలు ప్రతినిధి:23/09/2026** పోలవరం జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి నదిలో నీటి ప్రవాహం, నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని పోలీసు శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో చేపల వేట కోసం ఎవరూ గోదావరి నదిలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు.

**మద్దిరత్తిగూడెంలో అవగాహన కార్యక్రమం**

ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని మద్దిరత్తిగూడెంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ పాల్గొని ప్రజలకు పలు సలహాలు, సూచనలు అందజేశారు.

**నదిలోకి దిగొద్దు**

జోరువానల కారణంగా గోదావరిలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉన్నందున చేపల వేట, ఈత, ఇతర



కార్యకలాపాల కోసం నదిలోకి దిగరాదని పోలీసులు హెచ్చరించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో నది పరిసర ప్రాంతాల్లో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలి**

అధికారులు జారీ చేసే హెచ్చరికలు, సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ, అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ కోరారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

**ప్రాణ భద్రతే ప్రధానం**

జోరువానలు.. పెరుగుతున్న గోదావరి ప్రవాహం.. మారుతున్న నీటిమట్టం నేపథ్యంలో ప్రజలు ఎలాంటి సాహసాలకు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరారు. ప్రతి ఒక్కరూ సహకరించి గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లకుండా, నదిలోకి దిగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి జనసేన నేత ఆర్థిక భరోసా

**సిద్దవటం, సెప్టెంబర్ 23 (వార్తలు ప్రతినిధి):** మండలంలోని ఎస్.రాజంపేట గ్రామానికి చెందిన ఎద్దుల విజయ్‌కుమార్ ఈనెల 20న గుండెపోటుతో మృతి చెందారు. ఆకస్మికంగా కుటుంబ పెద్దను కోల్పోయిన విషయం తెలుసుకున్న రాజంపేట పార్లమెంట్ జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. కష్టకాలంలో కుటుంబానికి తాను ఉన్నానంటూ భరోసా కల్పించారు.అతికారి కృష్ణ తరఫున సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ మహబూబ్ బాషా (బాబి) బుధవారం ఎస్.రాజంపేటలోని మృతుడి ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుడి కుమారుడికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహబూబ్



బాషా మాట్లాడుతూ.. విజయ్‌కుమార్ మృతి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆకస్మిక మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో జనసేన పార్టీ తరఫున అండగా నిలవడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. భవిష్యత్తు లోనూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.

నిజాయితీ - నిష్పాక్షికత
వార్తలు
దిన పత్రిక

గురువారం , సెప్టెంబర్ 24, 2026




# ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో: రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్ కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురకసింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్ రాష్ట్రంలో నిరంతరాయ ంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు.

"కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.




## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్



**హైదరాబాద్ :** భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

## ఇది ముమ్మాటికి జూరాల రైతుల విజయం



**జూరాల :** జూరాల ఆయకట్టుకు సాగునీటి కోసం రైతులు చేసిన పోరాటం ఫలించిందని మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎనిమిది రోజుల రైతుల ఆందోళనలకు ప్రభుత్వం తలొగ్గిందని ఇది ముమ్మాటికి రైతుల విజయమన్నారు. ప్రాజెక్టులో నీళ్లు ఉన్నప్పటికి రైతులను కాంగ్రెస్ సర్కార్ అనవసరంగా గందరగోళానికి గురిచేసిందన్నారు. సడన్‌గా నీటి విడుదల బంద్ చేయడంతో పంటలు ఎండిపోతాయనే భయం రైతులను వెంటాడిందన్నారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల జూరాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీళ్లు విడుదల చేసిందని వానాకాలం సాగు పూర్తి అయ్యే వరకు నీళ్లు విడుదల చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాజకీయాలతీతంగా రైతులకు మద్దతుగా నిలుస్తుందని అందుకే నిన్న ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. కృష్ణా నదిలో వరద ప్రారంభమైనపుడు కూడా బీఆర్ఎస్ ధర్నా పిలుపుతోనే రైతులకు సాగునీరు వచ్చిందని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు.

# ఆదిలాబాద్ రిమ్స్ పిల్లల వార్డులో ఏసీ పేలిన ఘటన - ఐదుకు చేరిన మృతుల సంఖ్య

**ఆదిలాబాద్:** రిమ్స్ ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్- ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ఘటనలో మృతిచెందిన చిన్నారుల సంఖ్య ఐదుకు చేరింది. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌కు చెందిన దుర్గబాయి బిడ్డ రిమ్స్‌లో మృతి చెందారు. ఇంద్రవెల్లి మండలం దుబ్బ గూడకు చెందిన నాగుబాయి బిడ్డను నిర్మల్‌కు తరలిస్తుండగా మృత్యువాత పడ్డారు.

సోమవారం అర్ధరాత్రి రిమ్స్? ఆస్పత్రిలో ాజ పేలి దట్టంగా పొగ అలముకుంది. ఆ సమయంలో ఇంక్యూబెటర్లలో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యాధికారులు, అద్దాలను పగలగొట్టి పసికందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇచ్చోడకు చెందిన సలీం ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని



నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృతి చెందింది. తాజాగా మృతిచెందిన పసికందుల సంఖ్య ఐదుకు చేరింది. ఏసీ పేలి కలకలంఅర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా ఏసీ పేలిపోవటం కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన సిబ్బంది హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రౌండ్స్‌కు వచ్చిన డైరెక్టర్ జైసింగ్ విషయం తెలుసుకొని సిబ్బంది సహా అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఎన్ఐ న్‌సీయూ వెళ్లగా ఊపిరి ఆడనీయకుండా దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఓదార్చే ప్రయత్నం చేశారు. "నేను ఒక పేషెంట్?ను చూడటానికి వచ్చాను. ఆస్పత్రి డైరెక్టర్?తో మాట్లాడుతున్న క్రమంలో ఒక నర్సు వచ్చి బ్లాస్ట్? అయ్యి పొగ వస్తుందని చెప్పడంతో అందరం లోపలికి వెళ్లాం. అప్పటికే నల్లటి పొగ కమ్ముకుంది. మొత్తం చీకటిగా ఉంది. కరెంటు కూడా లేదు. కొంతమంది పసిపిల్లలను బయటకు తీసుకొచ్చాం. పొగ కారణంగా మా దుస్తులు మొత్తం నల్లగా అయ్యాయి" - సంతోశ్?, ప్రత్యక్ష సాక్షి, ఆదిలాబాద్‌ఘటనపై విచారణకు సీఎం ఆదేశంఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. పలువురు మంత్రులు సైతం రిమ్స్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి దామోదర ప్రమాదం దృష్ట్యా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. ముగ్గురు చిన్నారుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై కమిటీ వేశామన్న మంత్రి, నివేదిక వచ్చిన అనంతరం కార్యాచరణ చేపడతామన్నారు.

# హీరో నాని వినతిపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - స్థానికంగా దరఖాస్తు చేసుకోవాలని సూచన

**హైదరాబాద్:** హీరో నాని వినతిపై ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి స్పందించారు. భద్రతా మార్గదర్శకాలను గౌరవిస్తున్నందుకు నానికి అభినందనలు తెలిపారు. ప్రతిభావంతుడైన తెలంగాణ యువ దర్శకుడు శ్రీకాంత్ తీసిన చిత్రం పట్ల మీ నిబద్ధతను అభినందిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. ప్రీమియర్? షో చూసేందుకు అనుమతి కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీఎం సూచించారు. దానిని పరిశీలించి అక్కడి పోలీసులే నిర్ణయం తీసుకుంటారని నానికి ఎక్స్? వేదికగా సీఎం తెలిపారు. అసలు ఏం జరిగిందంటే? హైదరాబాద్?లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్యా థియేటర్?లో తన సినిమా 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షో చూసేందుకు అనుమతి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నటుడు నాని మంగళవారం ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రీమియర్ షో కోసం థియేటర్‌కు వెళ్లాలనుకుంటు న్నట్లు తెలిపిన నాని ప్రేక్షకులతో కలిసి సినిమాను ఆస్వాదిం చాలని ఆశపడుతున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల స్పందనను ప్రత్యక్షంగా చూస్తేనే నటుడిగా తనకు తృప్తి అని, అన్ని నిబంధనలు, భద్రతా చర్యలను పాటిస్తానని స్పష్టం చేశారు. తన అభ్యర్థనను సీఎం, సినిమాటోగ్రఫీ మంత్రి పరిశీలిస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. "సినిమాను అమితగా ప్రేమించే ఒక అభిమానిగా, మరీ ముఖ్యంగా చిన్నప్పటి నుంచే సినిమాను అత్యుత్తమ



స్థాయిలో ఆస్వాదించిన వ్యక్తిగా నేను ఈ విన్నపం చేస్తున్నాను. నాకు సినిమా అంటే, నాలాగే సినిమాను ప్రేమించేవారితో కలిసి చూడటమే. హైదరాబాద్‌లో ఆ అనుభూతికి 'హైదరాబాద్?లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. 'ది ప్యారడైజ్' సినిమా ప్రీమియర్ షో (సెప్టెంబర్ 23) కోసం ఆర్టీసీ క్రాస్ రోడ్స్?లోని థియేటర్‌ను సందర్శించి, మేము ఎవరి కోసం అయితే ఈ సినిమాను రూపొందించామో, ఆ ప్రేక్షకుల మధ్య కూర్చుని సినిమాను ఆస్వాదించాలని నేను కోరుకుంటున్నాను. ప్రేక్షకుల మధ్య కూర్చుని, సినిమా పట్ల వారి స్పందనను ప్రత్యక్షంగా అనుభవించడమే ఒక సినిమాను రూపొందించడంలో లభించే అత్యున్నత సంతృప్తి అని నేను నమ్ముతాను. అమలులో ఉన్న అన్ని ప్రోటోకాల్స్, భద్రతా మార్గదర్శ కాలను మేము ఖచ్చితంగా పాటిస్తాము. అదే మాకు అత్యంత ప్రాధాన్యతాంశం. నా విన్నపాన్ని మీరు సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాను" - నటుడు నాని ట్వీట్నటుడు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2: ది రూల్' సినిమా స్పెషల్ ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సంధ్యా థియేటర్ వద్ద ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన చోటు చేసుకుంది. ఆ ఘటన తర్వాత ఏ నటుడు కూడా ప్రీమియర్ షోకు హాజరుకాలేదు. ఈ తరుణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుందుకు రేవంత్ రెడ్డిని 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షో చూసేందుకు నాని అనుమతి కోరినట్లు తెలుస్తోంది.

## 'మొక్కలే మానవాళికి జీవనాధారం'




**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 23 :** మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని బూర్గంపహాడ్ మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ బానోత్ సరోజ అన్నారు. బుధవారం గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హరితదినం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మనం నాటే మొక్క నేడు వృక్షంగా మారి స్వచ్ఛమైన ఆక్సిజన్‌తో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ప్లాస్టిక్కు నిషేధించాలని, ప్లాస్టిక్ కారణంగా పచ్చదనానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుందని ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, ఉపసర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వార్డుమెంబర్ అవినీటి నర్సయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అప్రకటిత విద్యుత్ కోతలపై రైతుల ధర్నా.. సబ్‌స్టేషన్ ముట్టడి

**మహబూబ్ నగర్ :** అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం నాచహల్లి క్రిష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం సబ్‌స్టేషన్ సమీపంలో ఆందోళనకు దిగారు. వనపర్తి--పెబ్బేరు ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే డీఈతో మాట్లాడించాలని రైతులు పట్టుబట్టారు. రైతులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు 13 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. . చేశారు. ఈ ఆందోళనలో రైతులతో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కే మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధర్మనాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ దేగ మహేష్ రెడ్డి, నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, నారాయణ నాయక్, శంకర్ నాయక్, టికె నాయక్, సర్పంచ్ పద్మ వెంకటయ్య, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మహేష్, అంజి, రూప్ల నాయక్, గోవిందు నాయక్, శివ, ఆనంద్, తులసి రామకృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు .

# కాంగ్రెస్‌కు చేతగాక క్రాప్ హాలిడే వైపు దృష్టి

**నాగర్ కర్నూల్ :** కాంగ్రెస్ ప్రభుత్వానికి చేత గాక తెలంగాణలో క్రాప్ హాలిడే కు పరుగులు తీస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. చంద్రబాబుకు గురుదక్షిణగా శ్రీశైలం నీటిని పాలమూరు జిల్లాకు వదలడం లేదని విమర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతాంగం కన్నీళ్లు పెడుతోందని అన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో 5 మోటార్లు ఉంటే ఒకటి, రెండు మహా అయితే మూడు మాత్రమే నడిపిస్తు న్నారని దుయ్యబట్టారు. 800 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం నియోజక వర్గానికి చంద్రబాబు నీళ్లను తరలిస్తుండగా ,సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో మాత్రం నీళ్లు పారించడం లేదని విమర్శించారు.



బీఆర్ఎస్ హయాంలో 30 ఏళ్లలో పూర్తి కానీ ప్రాజెక్ట్ లను పరుగులు పెట్టించాం. 26వేల ఎకరాల ఆయకట్టును ఆరున్నర లక్షల ఎకరాలకు పెంచామని స్పష్టం చేశారు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నా ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమ్మక్క బ్యారేజ్ కట్టి 365 రోజులు నీళ్లు ఎత్తిందని, దేవాదుల వద్ద ఎందుకు 8 గంటలు మాత్రమే నడుపుతున్నారని తెలిపారు. మూడేళ్లలో కట్టిన ఒక్క ప్రాజెక్ట్ పేరు చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సవాల్ విసిరారు. కేవలం 8.8 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసి 88 టీఎంసీలు ఎలా చెబుతున్నారని నిలదీశారు. నెట్టెంపాడు, తుమ్మిళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎవరు కట్టారో ప్రజలకు తెలుసని అన్నారు. కాలం తెచ్చిన కరువు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని పేర్కొన్నారు. కరువు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. .కరువు వస్తే ప్రతి చుక్క నీళరు ఎత్తిపోసు కోవాలని సూచించారు. ప్యాకేజీ 3 పనులు యు ద్ధ ప్రతిపాదకన పూర్తి చేసి కరివెన వరకు రిజ ర్వాయర్లలో నీళ్లు నింపాలని డిమాండ్ చేశారు . ప్రతిపక్షాల మీద కమీషన్ లు వేయడం, లేదా 30శాతం కమిషన్ దండుకోవడం మాత్రమే కాంగ్రెస్‌కు తెలుసని విమర్శించారు.

నిజాయితీ - నిష్పాక్షికత
వార్తలు
దిన పత్రిక
గురువారం , సెప్టెంబర్ 24, 2026


## రైలుపైకి ఎక్కి హైటెన్షన్ వైర్‌ను పట్టుకునేందుకు యత్నం.. రేణిగుంటలో ఉత్కంఠ



**తిరుపతి,** తిరుపతిలోని రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి హల్ చల్ చేశాడు. రైలు పైకి ఎక్కి హైటెన్షన్ విద్యుత్ వైర్‌ను పట్టుకునేందుకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. సదరు వ్యక్తి తిరువనంతపురం - న్యూఢిల్లీ కేరళ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి దిగి.. ప్లాట్‌ఫాంపై కేకలు వేస్తూ రైలు పైకి ఎక్కాడు. అక్కడ హైటెన్షన్ విద్యుత్ వైర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా. ప్రమాదాన్ని గమనించిన వెంటనే రైల్వే అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆపై ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి అతడిని సురక్షితంగా కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే విద్యుత్ సరఫరా నిలిపివేతతో కొద్దిసేపు రైళ్ల రవాణా నిలిచిపోయింది. 'నన్ను అరెస్ట్ చేస్తే 48 గంటల్లో కోర్టులో హాజరుపరచాలి', 'త్రీ స్టార్ ఆఫీసర్ మాత్రమే రావాలి' అంటూ నిందితుడు హల్‌చల్ చేశాడు. వ్యక్తికి మతిస్థిమితం లేదా లేక మద్యం మత్తులో ఉన్నాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో రేణిగుంట రైల్వే స్టేషన్‌లో కొద్దిసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

# అక్టోబర్‌లో స్థానిక ఎన్నికలు.. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం: మంత్రి లోకేశ్



**అమరావతి, సెప్టెంబర్ 23:** స్థానిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈరోజు మంత్రులతో లోకేశ్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలని.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. అక్టోబర్‌లో ఎన్నికలు జరుగుతాయని.. స్థానిక ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దని తెలిపారు. కోర్టు పెండింగులో ఉన్నవి కూడా త్వరితగతిన పరిష్కరించుకుని అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎన్నికలు వాయిదా పడాలన్న గొడ్డలి పార్టీ కుయుక్తులు పని చేయవన్నారు. పొత్తుల అంశంపై సమన్వయ కమిటీ, అధిష్ఠానం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. ఓర్వలేకే డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు. విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రల పట్ల తనతోపాటు సంబంధిత మంత్రులూ అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ సూచించారు. గురువులపై గూండాలతో దాడులు చేయించే దుశ్చర్యకు గొడ్డలిపార్టీ పాల్పడిందని మండిపడ్డారు. శాప్ కార్యాలయం వద్దకు వచ్చి దాడులకు తెగపడి మీసాలు మెలేసినవారు.. పోలీసులు చట్టప్రకారం కేసులు పెట్టగానే పరారీలో ఉన్నారన్నారు. టీచర్లను కించపరుస్తూ ఎవరైనా దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అధికారంలో ఉండి చేసిన అక్రమాలపై ఆధారాలతో ఒక్కో కుంభకోణం బయటకు వస్తుంటే, ఓర్వలేకే డైవర్ట్ రాజకీయాల కోసం నిరుద్యోగులకు మేలు చేసిన డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలపై..రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతుండటం శుభపరిణామమని లోకేశ్ అన్నారు. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు. జలాశయాలు నింపుకునేందుకు ఇదో మంచి అవకాశమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# నీళ్లొదిలి మూడు వారాలైనా - వెలిగొండ నిర్వాసితుల్లో పునరావాస వెలితి



**వెలిగొండ:** ప్రాజెక్టు నుంచి నీరు వదిలి నల్లమలసాగర్ జలాశయం నింపుతున్నారు. తడారిన బీళ్లకు సాగునీళ్లొస్తున్నాయని రైతులు, గొంతెండిన ఊళ్లకు మంచినీళ్లు వస్తున్నాయని ప్రజలూ ఖుషీగా ఉన్నారు. మరి ఆ జల యజ్ఞాన్ని సాకారం చేయడానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులు ఆనందంగా ఉన్నారా? పునరావాస ప్యాకేజీ దక్కినవారి సంగతి సరే! దక్కని వారి మాటేంటి? ఎందుకంటే ఇప్పటికీ నిర్వాసిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో పునరావాసం అమలు చేయలేదు. 1000కి పైగా కుటుంబాలకు ప్యాకేజీ దక్కలేదు. వారికి ఇంటి స్థలాలు చూపలేదు. గెజిట్‌లో పేర్లు లేక ఆందోళన చెందుతున్న వారిలో అర్హులను తేల్చి, ప్యాకేజీ అందించే ప్రక్రియ పూర్తికాలేదు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు పరిధిలో మొత్తం 11 ఊళ్లలో 7321 కుటుంబాలు నివాసాలు కోల్పోయాని గుర్తించారు. ఈ మేరకు గతంలోనే గెజిట్ ప్రకటించారు. ఆగస్ట్ 31న నీరు విడుదల చేసే ముందు 6158 కుటుంబాలకు రూ.758.31 కోట్ల పునరావాస ప్యాకేజీ చెల్లించారు. నీరు వదులుతున్నారని మిగిలిన కుటుంబాలు గ్రామాలు ఖాళీ చేసి వెళ్లిపోయాయి. వాటిలో 1163 కుటుంబాలకు ప్యాకేజీ దక్కలేదు. నిజానికి ప్యాకేజీ అందించాకే వారిని ఖాళీ చేయించాల్సి ఉంది. ఇక 439 కుటుంబాల కోసం రూ.54.91 కోట్ల విలువైన బిల్లులు అప్‌లోడ్ చేసినట్లు మార్కాపురం జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. ఇంకో 349 కుటుంబాలకు చెందిన బిల్లులు సీఎంఎఫ్ఎస్‌లో అప్‌లోడ్ అవుతున్నాయి. 185 కుటుంబాలకు సంబంధించి ఇప్పటికీ అవార్డు పాస్ కాలేదు. ఇక 172 కుటుంబాలకు పరిహారం పొందే అర్హత లేదని అధికారులు తేల్చారు. కోర్టు కేసులు, వివాదాలు పెండింగ్‌లో ఉన్నందున 18 కుటుంబాలకు పునరావాస ప్యాకేజీ చెల్లించలేదు. ఇళ్ల నిర్మాణమే కీలకం : పునరావాసంలో ఇళ్ల నిర్మాణమే కీలకం. ఇంటి స్థలం చూపించి, నిర్మాణ ఖర్చులు చెల్లిస్తే తామే ఇళ్లు కట్టుకుంటామని 3962 కుటుంబాలు అంగీకారం తెలిపాయి. ఈ ఆప్షన్ ఎంచుకున్న వారికి పట్టాలు అందించినా, సుంకేశుల గ్రామ నిర్వాసితులకే ఎవరి స్థలాలు ఎక్కడో చూపించారు. తోకపల్లి, గోగులదిన్నె, ఇందుట్ల కాలనీల్లో మాత్రమే సర్కార్? మౌలిక వసతులు కల్పించింది. ఇడుపుల 1, 2 గ్రామాల నిర్వాసితుల కోసం కలనూతల కాలనీలో మట్టి నింపి చదును చేస్తున్నారు. ఇంకా సౌకర్యాలు సమకూరలేదు. అక్కచెరువు తండా, గొట్టిపడియ నిర్వాసితుల కోసం ఇంటి స్థలాల హద్దు రాళ్లు పాతారు. స్థలాలు కేటాయించలేదు. గుణ్నంచర్ల నిర్వాసితులకు ఇండ్లు నిర్మించడానికి 15 ఎకరాలను సేకరించాల్సి ఉంది. తమకు అన్యాయం జరిగిందన్న బాధిత కుటుంబాల్లో 1800 వరకు పునరావాస ప్యాకేజీకి అర్హమైనవిగా సర్కార్? గుర్తించింది. గెజిట్‌లో పేర్లు లేని వారిలో అర్హులను పరిశీలించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను నియమించి, అర్జీలు పరిశీలించారు.

## బర్డ్ డైరెక్టర్ నియామకంపై హైకోర్టులో పిల్




**అమరావతి** :బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ అండ్ రీహాబిలిటేషన్ ఫర్ డిజేబుల్డ్(బర్డ్) ఆసుపత్రి డైరెక్టర్‌గా డాక్టర్ జి.జగదీశ్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవో, చైర్మన్, బర్డ్ ట్రస్ట్ బోర్డు చైర్మన్, వ్యక్తిగత హోదాలో డాక్టర్ జగదీశ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానములు పరిధిలోని బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్‌గా 72 ఏళ్ల డాక్టర్ జి.జగదీశ్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ చిత్తూరు జిల్లాకు చెందిన చెన్నూరు పెంచలయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది దుగ్గిరాల సుభాష్ వాదనలు వినిపించారు. టీటీడీ సర్వీస్ నిబంధనల ప్రకారం డైరెక్టర్ పోస్టును డిప్యుటేషన్ లేదా పదోన్నతి ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుందన్నారు. పదవీ విరమణ చేసినవారిని డైరెక్టర్‌గా నియమించేందుకు సర్వీస్ రూల్స్ అనుమతించవన్నారు. టీటీడీ మార్గదర్శకాల ప్రకారం పదవీ విరమణ చేసిన ఉద్యోగులను నియమించాలంటే స్క్రీనింగ్ కమిటీ పరిశీలన, టీటీడీ బోర్డు ఆమోదం తప్పనిసరి అన్నారు. డాక్టర్ జగదీశ్ నియామకం విషయంలో ఈ ప్రక్రియను అనుసరించలేదని, ముఖ్యమంత్రి కార్యాలయం సిఫార్సుతో నియామకం జరిగిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తీసుకున్న ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## సాయికృష్ణ కేసు.. హైకోర్టు విచారణపై స్టే విధించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23:** గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును సుప్రీం ధర్మాసనం సీరియస్‌గా తీసుకుంది. సాయికృష్ణ కేసులో ఏపీ డీజీపీ, విజయవాడ కమిషనర్లపై చర్యలు తీసుకోవాలంటూ వైసీపీ ఎంపీ గురుమూర్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు(బుధవారం) జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం విచారించింది. హైకోర్టులో దాఖలైన పిటిషన్లు అన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఏపీ హైకోర్టులో విచారణపై స్టే విధించింది. సుప్రీంకోర్టులో విచారణ ముగిసేంతవరకూ హైకోర్టులో విచారణను నిలిపివేస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పోలీసు కస్టడీలో సాయికృష్ణ అదృశ్యమవడం చట్ట వ్యతిరేకమే అని జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం పేర్కొంది. సీల్డ్ కవర్‌లో కేసుకు సంబంధించిన వివరాలన్నింటినీ సెప్టెంబర్ 30వ తేదీలోగా సుప్రీంకోర్టుకు అందజేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ప్రతివాదులందరకీ నోటీసులను జారీచేసిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను అక్టోబర్ 12వ తేదీకి వాయిదా వేసింది.

# వైభవంగా శ్రీవారి చక్రస్నానం మహోత్సవం - భారీగా తరలివచ్చిన భక్తులు



**తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత పవిత్రమైన చక్రస్నాన మహోత్సవంతో చివరి ఘట్టానికి చేరుకున్నాయి. వరాహస్వామి పుష్కరిణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి వేద మంత్రోచ్చారణల నడుమ స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం శుభముహూర్తంలో శ్రీవారి సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో జల ప్రవేశం చేయడంతో చక్రస్నాన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకను తిలకించేందుకు వేలాది మంది భక్తులు తెల్లవారుజామున నుంచే పుష్కరిణి వద్దకు తరలివచ్చారు. మలయప్పస్వామితో పాటు సుదర్శన చక్రానికి పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. తిరుమంజనం అనంతరం సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో జల ప్రవేశం చేయగా, భక్తులు గోవింద నామస్మరణలతో హర్షధ్వానాలు చేశారు. చక్రత్తాళ్వారుకు పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు స్నానం చేయించారు. అనంతరం భక్తులకు పుష్కరిణిలో పుణ్యస్నానాలకు అనుమతి కల్పించారు. పుష్కరిణిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. చక్రస్నానం పవిత్రత రోజంతా ఉంటుందని వేద పండితులు తెలిపారు. ప్రశాంతంగా, క్రమపద్ధతిలో పుణ్యస్నానాలు ఆచరించాలని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది.

చక్రస్నాన మహోత్సవం విశిష్టత ఏమిటంటే?: పురాణాల ప్రకారం వైకుంఠంలోని విరజా నది స్వామి కన్నా ముందే భువికి దిగి వచ్చి స్వామి పుష్కరిణిగా మారిందని విశ్వసిస్తారు. స్వామి తన జలక్రీడల కోసం స్వయంగా తెప్పించుకున్న ఈ పుష్కరిణి సకల పాపహరిణిగా ప్రసిద్ధి చెందింది. శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులు ముందుగా శ్రీవారి ఆలయానికి ఉత్తరంగా ఉన్న ఈ పుష్కరిణిలో స్నానంచేసి, స్వామి దర్శనానికి వెళ్ళాలనే నియమం ఉంది. తారకాసురుని వధించి బ్రహ్మ హత్యాదోషానికి గురైన సుబ్రహ్మణ్యస్వామి సైతం ఈ పుష్కరిణిలో స్నానం చేసి ఆ పాపాన్ని పోగొట్టుకున్నట్లు స్కంద పురాణం ద్వారా తెలుస్తోంది. ముల్లోకాలలోని సకల తీర్థాలు స్వామి పుష్కరిణిలోనే కలిసి ఉంటాయని స్వయంగా వరాహస్వామి, భూదేవికి వివరించినట్లు వరాహ పురాణం చెబుతోంది. అందుకే స్వామి పుష్కరిణిలో పవిత్ర చక్రస్నానం తర్వాతనే బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి."శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాం. అన్ని విభాగాల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇదే స్ఫూర్తితో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం. స్పందన వచ్చిందని" టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. చక్రస్నాన మహోత్సవంతో బ్రహ్మోత్సవాల ప్రధాన కార్యక్రమాలు ముగియగా, రాత్రి ధ్వజావరోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. గురువారం నుంచి తిరుమలలో ఆర్జిత సేవలు, ప్రివిలేజ్డ్ దర్శనాలు యథావిధిగా పునఃప్రారంభం కానున్నాయని టీటీడీ వెల్లడించింది. అదేవిధంగా అక్టోబర్ 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనుంది.

# 51 మంది వైసీపీ నేతలపై రౌడీ షీట్లు ఓపెన్ చేయాలంటూ ఆదేశాలు



**విజయవాడ :** విజయవాడ శాప్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణుల గతంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై కూడా దాడి
దేవినేని అవినాశ్ సహా 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని సీపీ ఆదేశంమంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంపై గతంలో దాడి కేసుతో పాటు ఇటీవల విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణిస్తూ విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. నగరం పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారంటూ ప్రతిపక్ష వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సహా మొత్తం 51 మందిపై వెంటనే రౌడీషీట్లు తెరవాలని స్థానిక పోలీస్ స్టేషన్ల సీఐలను ఆదేశించారు. ఈ రౌడీషీటర్ల జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేవినేని అవినాశ్, మాజీ ఫ్లోర్ లీడర్ అరవ సత్యం, మాజీ కార్పొరేటర్ కాలపాల అంబేద్కర్ సహా పలువురు ముఖ్య నాయకుల పేర్లు ఉన్నాయి. విజయవాడ పరిధిలోని భవానీపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, కృష్ణలంక, మాచవరం, పటమట, గవర్నర్‌పేట తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేసే ప్రక్రియను క్షేత్రస్థాయి ఏసీపీలు నేరుగా పర్యవేక్షించాలని కమిషనరేట్ ఆదేశాల్లో పేర్కొన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పోలీసు శాఖ స్పష్టం చేసింది. మరోవైపు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తమ నాయకులపై కక్షపూరితంగానే ఈ చర్యలు తీసుకుంటున్నారని వైసీపీ ఆరోపిస్తోంది.

## బీజేపీలో కీలక మార్పులు.. ఏపీ, తెలంగాణకు కొత్త ఇన్‌చార్జిలు




**అమరావతి**
బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిలను నియమించింది. ఏపీ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియాను, కో-ఇన్‌చార్జిగా శ్రీమతి వనతి శ్రీనివాసన్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్‌ను, కో-ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, శ్రీమతి రేఖా శర్మలను నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం.. రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు.. రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు వచ్చాయి. ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను పార్టీ అప్పగించింది. బీజేపీ ఏపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని బీజేపీ ఒడిశా ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణను తమిళనాడు బీజేపీ కో-ఇన్‌చార్జిగా, డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో-ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో తెలుగు రాష్ట్రాల నాయకులకు ఇతర రాష్ట్రాల్లో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు కూడా దక్కాయి. .

# కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు క్లారిటీ ఇచ్చిన అధికారులు..!




**న్యూఢిల్లీ:**సర్' సహా అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకున్నామన్న ఈసీ ఇద్దరు కమిషనర్లు అభ్యం తరాలు చెప్పారన్న వార్తలను ఖండించిన అధికారులు కొన్ని అంశాలపై వారు పరిశీల నలు మాత్రమే చేశారని వెల్లడి
14 సందర్భాల్లో అభ్యంతరాలంటూ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ఓటర్ల జాబితా కచ్చితత్వమే 'సర్' లక్ష్యమని స్పష్టీకరణ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిష నర్లు పలు నిర్ణయాలపై రికార్డులో అభ్యం తరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలి ంచిందని పేర్కొంది. ఇటీవల 'ఇండియన్ ఎక్స్‌ప్రె స్' కథనం.. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది. ఈసీ వర్గాల ప్రకారం.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై ముగ్గురి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'సర్' వల్ల కొందరి ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యే అవకాశం ఉందంటూ ప్రతిపక్ష నేతలు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితా కచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ చెబుతోంది.

## 28 ఏండ్ల నాటి కశ్మీరీ పండిట్ల ఊచకోత కేసుపై విచారణ పునఃప్రారంభం



**కశ్మీర్** లోయలో ఉగ్రవాదం తీవ్రంగా ఉన్నప్పుడు జరిగిన చారిత్రక నేరాలకు సంబంధించిన కేసులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తిరిగి విచారణ చేసేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కశ్మీరీ పండిట్ల ఊచకో త కేసుపై కూడా దృష్టిపెట్టింది స్టేట్ ఇన్వెస ్టిగేషన్ ఏజెన్సీ . ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాలను పరిశీలించి అనుమానితులను విచారిస్తూ ఆధారాలను సేకరిస్తుంది ఎస్ఐఏ. అంతేకాదు ఇతర ప్రముఖ హత్య కేసులపై కూడా తిరిగి విచారణ చేపడుతుంది ఎస్ఐఏ. ఈ కేసుల విచారణ నిమిత్తం ఎస్ఐఏ బృందం ఇటీవల పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి సోదాలు చేపట్టింది. 23 మంది పండిట్ల ఊచకోత1998, జనవరి 25న గందర్బల్ జిల్లాలోని వంధామా గ్రామంలో కశ్మీరీ పండిట్ కుటుంబాల ఇళ్లలోకి ఉగ్రవాదులు ఆయుధాల తో చొరబడ్డారు. తొమ్మిది మంది మహిళలు, నలుగు పిల్లలతో సహా మొత్తం 23 మందిని కాల్చి చంపారు. ఈ ఘటన రంజాన్ నెలలోని పవిత్ర రోజుల్లో ఒకటైన షబ్ ఎ ఖద్ర్ రాత్రి, గణతంత్ర దినోత్సవానికి ఒకరోజుముందు జరిగింది. ఈ కేసు సుమారు మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉంది. అదేవిధంగా ఉగ్రవాదులు 1989, సెప్టెంబర్‌లో అప్పటి జమ్మూ కశ్మీర్ బీజేపీ ఉపాధ్యక్షుడు అయిన కశ్మీరీ పండిట్ టీకా లాల్ టప్లూను కాల్చిచంపారు. జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) ఉగ్రవాది మక్బూల్ భట్‌కు మరణశిక్ష విధించిన జస్టిస్ నీలకంఠ గంజూను 1989, నవంబర్ 4న హత్య చేశారు. వీటితో పాటు 1990లో జరిగిన నర్సు సరళా భట్, రచయిత సర్వానంద్ కౌల్ ప్రేమి, అతని కుమారుడు వీరేందర్ కౌల్‌ల హత్య కేసులపై కూడా ఎస్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులకు సంబంధించి బతికి ఉన్న అనుమానితులు, ఉగ్రవాదులకు సహాయం చేసినవారిని గుర్తించడంలో సహాయపడే ఆధారాలను సేకరిస్తుంది.

## 'నిఠారీ' హత్యల నిర్దోషి సురీందర్ కోలీ.. హరిద్వార్‌లో ఆత్మహత్య



**డెహ్రాడూన్:** ఒకప్పుడు 'నిఠారీ రాక్షసుడు'గా ముద్రపడి, సంచలనం సృష్టించిన 2006 నాటి హత్యల కేసులో నిర్దోషిగా విడుదలైన సురీందర్ కోలి (ౌాబతీఱఅసవతీ ఖశీశ్రీఱ) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఒక టీస్టాల్ లోపల ఉరికి వేలాడుతూ అనుమా నాస్పద స్థితిలో అతడి మృతదేహం కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడున్న ఆధార్ కార్డ్ ఆధారంగా మృతుడిని సురీందర్ కోలిగా గుర్తించారు. గత ఏడాది సుప్రీంకోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసిన తర్వాత, గత కొంతకాలంగా హరిద్వార్‌లో టీ అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. అతడి మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, 2006 డిసెంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా సెక్టార్ 31లోని డీ 5 బంగ్లా పక్కన ఉన్న కాలువ వెనుక ప్లాస్టిక్ సంచులలో కుక్కిన 16 మానవ పుర్రెలు, ఎముకలు, దుస్తులను పోలీసులు కనుగొన్నారు. సమీపంలోని నిఠారీ గ్రామానికి చెందిన పేదలు, కూలీల కుటుంబాలకు చెందిన పిల్లలు అదృశ్యమవుతున్నట్లు స్థానికులు చాలా కాలంగా ఫిర్యాదులు చేశారు. అయితే వారి ఆందోళనలను పోలీసులు తొలుత పట్టించు కోలేదని ఆరోపణలు వచ్చాయి. మరోవైపు పాయల్ అనే యువతి అదృశ్యంపై పోలీసులు దర్యాప్తు చేశారు. ఆమె మొబైల్ ఫోన్‌ను స్థానికుడైన రిక్షా వ్యక్తి వద్ద గుర్తించారు. డి-5లో నివసించే వ్యక్తి ఆ మొబైల్ ఫోన్ తనకు ఇచ్చినట్లు అతడు చెప్పాడు. ఆ ఇల్లు వ్యాపారవేత్త మొనిందర్ సింగ్ పాంధర్‌కు చెందగా, సురీందర్ కోలి అక్కడ పనివాడిగా ఉన్నాడు. పోలీసులు ఆ ఇంట్లో సోదాలు చేయగా 19 మంది పిల్లల హత్యలు, నరమా ంస భక్షణకు సంబంధించిన ఆధారాలు లభించాయి.

# ఢిల్లీ పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు.. పోలీసుల ముమ్మర తనిఖీలు




**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో పాఠశాలలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం కల కలం రేపుతోంది. మయూర్ విహా ర్ ఫేజ్-1లోని బలరామ్ పబ్లిక్ స్కూల్‌కు బాం బు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అప్ర మత్తమైన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇతర భద్రతా బృందాలు పాఠశాల వద్దకు చేరుకున్నాయి. ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారుల ప్రకారం.. ఉదయం 8.40 గంటలకు పాఠశా లలో బాంబు ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే భద్రతా బృందాలు పాఠశాలకు చేరు కుని తనిఖీలు ప్రారంభించాయి. పాఠశాల ప్రాంగణంలోని తరగతి గదులు, కారిడార్లు, ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ వారంలోనే ఢిల్లీలోని పలు ప్రముఖ పాఠశాలలకూ బాంబు బెదిరింపు ఈ-మెయిళ్లు వచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు. చాణక్యపురిలోని బ్రిటిష్ స్కూల్, ధౌలా కువాన్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్, లోధీ ఎస్టేట్‌లోని సర్దార్ పటేల్ విద్యాలయం, ఎయిర్ ఫోర్స్ బాల్ భారతి స్కూల్, కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌కు బెదిరింపు ఈ-మెయిళ్లు వచ్చినట్లు వెల్లడించారు. ఈ ఈ-మెయిళ్లన్నీ పంజాబీ భాషలో ఉన్నట్లు అనుమానిస్తున్నామని చెప్పారు. పాఠశాలలతో పాటు పోలీస్ స్టేషన్లు, పోలీస్ పోస్టులు, కోర్టు సముదాయాల వద్ద పేలుళ్లు జరుగుతాయని దుండగులు హెచ్చరించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 29 వరకు ఢిల్లీ మెట్రో, రైళ్లలో ప్రయాణించవద్దనీ ఈ-మెయిళ్లలో ఉన్నట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అయితే, బెదిరింపులు వచ్చిన ప్రతి ప్రాంతానికీ భద్రతా బృందాలు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఆయా పాఠశాలలు, కార్యాలయాల వద్ద ముమ్మరంగా తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎలాంటి బాంబులు లభ్యం కాలేదని పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం బలరామ్ పబ్లిక్ స్కూల్‌లో తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీలు పూర్తయిన అనంతరం అధికారులు మరిన్ని కీలక వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.

# ఎన్నికల కమిషనర్ల చట్టం-2023 రాజ్యాంగబద్ధతపై భిన్నాభిప్రాయంతో తీర్పు



**న్యూఢిల్లీ:** ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయ మూర్తిని మినహాయిస్తూ కేంద్రం తీసుకొచ్చిన 2023 నాటి చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బివ్యక్తం చేసింది. ఈ పిటిషన్లను విస్తృత ధర్మాస నానికి బదిలీ చేయాలా వద్దా అనే అంశంపై ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఈ పిటిషన్లలో రాజ్యాంగ ప్రాముఖ్యం కలిగిన ప్రశ్నలు ఉన్నాయని, వీటిని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీచేయాలన్న కేంద్ర ప్రభుత్వ వాదనను బెంచ్‌కు నేతృత్వం వహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా తోసిపుచ్చారు. ఇదే ధర్మాసనంలో ఉన్న మరో న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్రశర్మ కేంద్రం వాదనతో ఏకీభవించారు. ఈ కేసుని సమర్థంగా, ప్రామాణికంగా విచారించేందుకు తగిన సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఇద్దరు న్యాయమూర్తులు అంగీకరించారు. ఈ మేరకు తదుపరి నిర్ణయం కోసం పరిపాలనా పరంగా ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్ ముందు ఉంచాలని నిర్ణయించారు. రాజ్యాంగ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు శాశ్వతంగా ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని ద్విసభ్య ధర్మాసనం సీజేఐని కోరింది. 'కార్యనిర్వాహక వర్గానికి అధిక ప్రాధాన్యం'"స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు జరగాలంటే ఈసీఐ ఒక స్వతంత్ర సంస్థగా ఉండటమే కాకుండా, స్వతంత్రంగా వ్యవహ రిస్తున్నట్లు కనిపించాలి అనేది ఒక ప్రాథమిక సూత్రం. ఇలాంటి పరిస్థితుల్లో ఎంపిక కమిటీలో ఒక కేబినెట్ మంత్రిని చేర్చడం వల్ల ఒక తటస్థ ఎంపికదారు అందిం చగల స్వతంత్రత్వాన్ని అందించడంలో విఫలమవుతుం ది. పైగా, ఆ కేబినెట్ మంత్రి కేవలం తన నాయకుడి గొంతునే ప్రతిధ్వనిస్తారు. ఫలితంగా ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నాయకుడి (ౌశ్రీ) ఉనికి, ఆయనను చేర్చిన ఉద్దేశాన్ని ముందుకు తీసుకెళ్లకుండా చాలావరకు అలంకారప్రా యంగా మిగిలిపోతుంది. కార్యనిర్వాహక వర్గం నుంచి ఇద్దరు సభ్యులు కమిటీలో ఉండటం వల్ల వారి వర్గానికి ప్రభావవంతమైన వీటో అధికారం ఉంటుంది. ఆ వీటోనే డాక్టర్ అంబేడ్కర్ వ్యతిరేకిస్తూ దీనిని ఆమోదించలేదు." అని జస్టిస్ దత్తా అన్నారు. 2023 చట్టం కార్యని ర్వాహక వర్గానికి అధిక ఎంపిక అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రెదెబ్బతీస్తుందని పిటిషన ర్లు ప్రస్తావించిన అంశంలో ప్రాథమికంగా సారం ఉన్నట్లు కనిపిస్తోంసరైన కారణాలతోనే వాదించారని అన్నారు. అయితే, రాజ్యాంగం లోని ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయిం చాల్సి ఉంటుందని జస్టిస్ శర్మ వ్యాఖ్యానిం చారు. కాగా, సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) స్థానంలో కేంద్ర మంత్రిని తీసుకునేం దుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఈ ఆదివారం బ్యాంకులు పనిచేస్తాయి: కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ




**న్యూఢిల్లీ:** బ్యాంకులకు సెప్టెంబర్ 26 (నాలుగో ఆదివారం), 27 (ఆదివారం) సాధారణ సెలవు రోజులు. బ్యాంక్ ఉద్యోగ సంఘాలు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చాయి. దీంతో వినియోగదారులకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఈ ఆదివారం (సెప్టెంబర్ 27) బ్యాంకులు పనిచేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకింగ్ సేవలకు వరుసగా ఐదు రోజులు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఆదివారం బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం అనుస ంధానిత శాఖలు, కరెన్సీ విభాగాల కార్యకలా పాలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమో దం తెలిపింది. దీంతో వినియోగించుకోవచ్చు. సౌకర్యం కోసం బ్యాంకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. అందుకే మూడు రోజుల సమ్మెను వాయిదా వేయాలని ప్రభుత్వం, బ్యాంకు బ్యాంక్ ఉద్యోగ సంఘాలకు విన్నవించాయి. అలాగే బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటనలో పేర్కొంది.

## కరం వేడుకల్లో విషాదం.. నదిలో మునిగి ఐదుగురు దుర్మరణం..



**పాలము జిల్లా :**
గిరిజన పండుగఅయిన 'కరం' వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. వేడుకల్లో భాగంగా పూజించిన చెట్టు కొమ్మను ఈ తెల్లవారుజామున నిమజ్జనాని కి తీసుకెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. నిమజ్జనం చేసే క్రమంలో నదిలోకి దిగిన ఐదుగురు వ్యక్తులు ప్రవాహంలో కొట్టుకుపోయా రు. వివరాల్లోకి వెళ్తే.. పాలము జిల్లా లోని మారుమూల బొకాయ గ్రామం లో మంగళవారం ఆదివాసీలు సంప్రదాయ 'కరం' వేడుకలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున జిల్లాలోని కోయల్ నదిలో చెట్టుకొమ్మను (వేడుకల్లో భాగంగా పూజలందుకున్న దైవం) నిమజ్జనం చేయడానికి వెళ్లారు. కొమ్మను నీటిలో వదిలేందుకు ఐదుగురు నదిలోకి దిగారు. నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో పట్టుతప్పి కొట్టుకుపోయారు. వారిని రక్షించడానికి అక్కడ ఉన్న వారు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ లాభం లేకపోయింది. ఆ తర్వాత జాలర్లు మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గిరిజనులు సర్హుల్ పండుగ తర్వాత అతిపెద్ద పండుగగా 'కరం' పండుగను జరుపుకుంటారు. జార్ఖండ్‌లో మంగళవారం ఈ పండుగ జరుపుకున్నారు. ఈ పండుగలో 'కరం' చెట్టు కొమ్మను పూజిస్తారు. ఆ చెట్టు కొమ్మను నదిలో నిమజ్జనం చేయడంతో ఈ ఉత్సవం ముగుస్తుంది. ఈ క్రమంలోనే నిమజ్జనం కోసం నీళ్లలో దిగి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

## అమెరికా వెళ్లనున్న ప్రధాని మోదీ.. డిసెంబర్‌లో జీ20 సదస్సుకు హాజరు




**న్యూఢిల్లీ:**ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో అమెరికా వెళ్లబోతున్నారు. డిసెంబర్‌లో జరిగే జీ20 సదస్సులో పాల్గొనేందుకు మోదీ అమెరికాలో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సదస్సుకు అధ్యక్షత వహిస్తారు. డిసెంబర్ 14, 15 తేదీల్లో అమెరికా, ఫ్లోరిడాలోని ట్రంప్ నేషనల్ డోరల్ మియామి రిసార్ట్‌లో ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు జీ20 దేశాల అధినేతలు హాజరవుతారు. మోదీ అమెరికా పర్యటన దాదాపు ఖరారైనప్పటికీ.. ప్రభుత్వం అధికారికంగా ఇంకా ప్రకటించలేదు.
మోదీ ఈ సదస్సుకు హాజరైతే అక్కడ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ప్రధానంగా వ్యాపారం, వాణిజ్యం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి. ఇటీవల ఇండియాపై అమెరికా విధిస్తున్న సుంకాలపై చర్చలు జరుగుతాయి. రష్యా, ఇరాన్ నుంచి చమురు కొంటున్నందున ఇండియాపై అమెరికా భారీ సుంకాలు విధిస్తోంది. భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై 100 శాతం పన్నులు విధించాలని ట్రంప్ నిర్ణయించారు. తమ దేశంలో జరగబోయే జీ20 సదస్సులో ట్రంప్ కలవాలని అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తోంది మోదీ కోసమే అని ఇండియాలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ అన్నారు. మోదీ, ట్రంప్ గత జూన్‌లో ఫ్రాన్స్‌లోని ఎవియన్‌లో జరిగిన జీ7 సదస్సులో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రేడ్, రక్షణ, ఎనర్జీ, టెక్నాలజీ వంటి అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. జీ20 సదస్సుతోపాటు క్వాడ్ సదస్సు కూడా డిసెంబర్‌లోనే జరిగే అవకాశం ఉంది. ఇండియా, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా వంటి దేశాలు క్వాడ్ సభ్యదేశాలుగా ఉన్నాయి. మోదీ అమెరికా పర్యటన తర్వాత పక్కనే ఉన్న కెనడాలో కూడా పర్యటించే అవకాశం ఉంది. ఈ పర్యటన ఇంకా ఖరారు కావాల్సి ఉంది.


# వెండికొండ మీరాబాయి

## వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం సొంతం
## బ్యాడ్మింటన్‌లో మెన్స్ జట్టుకు కాంస్యం
## 2026 ఆసియా క్రీడలు

ఓ ఒలింపిక్ పతకం, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మూడు మెడల్స్. కామన్‌వెల్త్ క్రీడల్లో మరో మూడు పతకాలు. ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ ఓ మెడల్. ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్లలో అన్నింటా పోడియం ఫినిష్ చేసినా, అయినా ఏదో వెలితి. అదే ఆసియా క్రీడల్లో మెడల్. 2026లో ఆ లోటును తీర్చుకుంది దిగ్గజ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను. ఆసియా క్రీడల్లో మహిళల 49 కేజీల విభాగంలో మీరాబాయి చాను రజత పతకం సాధించింది.ఆసియా క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టింగ్ పతక నిరీక్షణకు తెరపడింది. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో తెలుగు తేజం కరణం మల్లీశ్వరి మహిళల 63 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా.. సరిగ్గా 28 ఏండ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మరో భారత వెయిట్‌లిఫ్టర్ వెండి కాంతులతో వెలుగొందింది. ఇటు భారత్‌తో పాటు మీరాబాయి చానుకు సైతం ఆసియా క్రీడల్లో పతక వెలితి వేధించింది. 2014 ఆసియా క్రీడల్లో తొలిసారి పోటీపడిన మీరాబాయి చాను తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2018 జకర్తా ఆసియా క్రీడలకు గాయంతో దూరమైంది. 2023 గాంగ్జౌ ఆసియా క్రీడల్లో నాల్గో స్థానంతో పతకానికి అడుగు దూరంలో ఆగిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్‌తో శిఖర స్థాయికి చేరుకున్న మీరాబాయి చాను.. ఆసియా క్రీడల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. 49కేజీల మహిళల విభాగంలో స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. ఓవరాల్‌గా 198 కేజీలతో మీరాబాయి చాను రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్, డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ రి సంగ్ గమ్ 215 కేజీలతో (94o121) బంగారు పతకం నిలుపుకుంది. ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్‌కు ఇది వరుసగా మూడో బంగారు పతకం. ఇండోనేషియా వెయిట్‌లిఫ్టర్ లులుక్ డయానా 191 కేజీలు (88o103) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో మీరాబాయి చాను 83 కేజీలు, 85 కేజీలు, 87కేజీలు ఎటువంటి తడబాటు లేకుండా అలవోకగా ఎత్తిపడేసింది. క్లీన్ అండ్ జెర్క్‌లో తొలుత 107 కేజీలు ఎత్తిన మీరాబాయి చాను ఆ తర్వాత 111 కేజీలతో మెరుగైంది. కానీ ఆ తర్వాత మూడో ప్రయత్నం చేయలేదు. 'కొంత ఒత్తిడి ఉండేది. కానీ పతకం నెగ్గుతానా లేదా అనేంత ఒత్తిడి కాదు. మెడల్ సాధిస్తాననే నమ్మకం నాకుంది. నన్ను నమ్మేవాళ్లకు నాపై అంచనాలు ఉన్నాయి. నా కోచ్‌లు, సహాయక సిబ్బంది నేను దేశానికి మరో మెడల్ సాధించేందుకు సహకరించారు'అని మీరాబాయి చాను తెలిపింది. మహిళల 53 కేజీల విభాగంలో పోటీపడిన జ్ఞానేశ్వరి యాదవ్ 195 కేజీలు (87o108)తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. **బ్యాడ్మింటన్‌లో కాంస్యం** పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత్ కాంస్య పతకం సాధించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో అగ్రజట్టు చైనా చేతిలో భారత్ 1-3తో పరాజయం పాలైంది. తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ 16-21, 18-21తో షి యుకి చేతిలో ఓడాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-11, 22-2-తో లియాంగ్, చాంగ్‌లపై గెలుపొంది లెక్క సమం చేశారు. రెండో సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 19-21, 13-21తో షి ఫెంగ్ చేతిలో కంగుతిన్నాడు. రెండో డబుల్స్‌లో హరిహరణ్, ఎంఆర్ అర్జున్ జోడీ 16-21, 9-21తో నిరాశపరిచారు. దీంతో చైనా 3-1తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో ఓటమితో భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.వుషూలో భారత్ కనీసం సిల్వర్ మెడల్ ఖాయం చేసుకుంది. మహిళల వుషూ 60 కేజీల విభాగంలో రోషిబినా దేవి పసిడి పోరుకు చేరుకుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఇండోనేషియా అమ్మాయి తానియాపై 2-0తో రోషిబినా దేవి గెలుపొందింది. నేడు ఫైనల్లో పసిడి పతకం కోసం చైనా అమ్మాయి జాంగ్‌తో రోషిబినా దేవి పోటీపడనుంది.



**షూటింగ్‌లో డబుల్ ధమాకా** షూటింగ్‌లో భారత్ బుధవారం డబుల్ ధమాకా మోగించింది. స్కీట్ టీమ్ విభాగంలో భారత పురుష, మహిళల జట్లు కాంస్య పతకం సాధించాయి. మహేశ్వరి చౌహాన్, పరినాజ్ దాలివాల్, రైజా ధిల్లాన్‌లతో కూడిన మహిళల జట్టు 331 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా (357), కజకిస్తాన్ (336) గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించాయి. అనంత్‌జిత్ సింగ్, మేరాజ్ అహ్మద్ ఖాన్, భవతేజ్ సింగ్ గిల్‌తో కూడిన మెన్స్ జట్టు 346 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. స్టార్ షూటర్ మను భాకర్ మహిళల 10మీ ఎయిర్ పిస్టల్ విభాగంలో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. 10మీ ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో ఇషా సింగ్, సురుచి సింగ్, మను భాకర్ త్రయం వియత్నాంతో కలిసి 1719 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచినా.. మెరుగైన ఇన్నర్ 10 స్కోరింగ్‌తో వియత్నాం కాంస్య పతకం దక్కించుకుంది. **సాఫ్ట్‌టెన్నిస్‌లో మెడల్ ఖాయం** ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారి సాఫ్ట్ టెన్నిస్‌లో పతకం ఖాతాలో వేసుకోనుంది. పురుషుల వ్యక్తిగత సాఫ్ట్‌టెన్నిస్‌లో జే మీనా సెమీఫైనల్‌కు ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో షెర్విన్ నుగియట్‌పై ఏడు గేముల థ్రిల్లర్‌లో గెలుపొందాడు. 0-4, 4-2, 2-4, 4-2, 5-3, 2-4, 7-5తో జే మీనా విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాడు. జే మీనా సెమీస్‌లో అడుగుపెట్టి కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకున్నాడు.



## సాఫ్ట్ టెన్నిస్‌లో కాంస్య పతకం

హైదరాబాద్: ఆసియా క్రీడల సాఫ్ట్ టెన్నిస్ విభాగంలో భారతదేశం చారిత్రక ఘనత సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల క్రీడాకారుడు జయ్ మీనా కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే ఈ క్రీడలో భారత్‌కు పతకం దక్కడం ఇదే తొలిసారి.బుధవారం నాటి సెమీఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన టకుయా కురోసాకాతో జయ్ మీనా తలపడ్డాడు. 45 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ ప్రారంభంలో జయ్ వరుసగా మూడు గేమ్‌లు ఓడిపోయి ఒత్తిడిలో పడ్డాడు. ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లను (4-1, 6-4) తన ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు.



## ఆసియా క్రీడల్లో భారత్‌కు డబుల్ పతకాలు

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం రెండు ఈవెంట్లలో మెడల్స్ దక్కాయి. స్కీట్ టీమ్ విభాగంలో భారత మహిళ, పురుష జట్లు కాంస్యం దక్కించుకున్నాయి. అటు భారత స్టార్ షూటర్ మను బాకర్ నిరాశకు గురిచేసింది. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రైజా దిల్లాన్, మహేశ్వరి చౌహన్, పరినాజ్ ధలీవాల్.. 331 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో కాంస్యం దక్కింది. ఈ ఈవెంట్‌లో చైనా బృందానికి బంగారు పతకం రాగా.. కజకిస్థాన్ టీమ్ రజతం గెలిచింది.ఇక, పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, భవతేగ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మద్ ఖాన్.. 346 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. మరోవైపు, వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఒలింపిక్‌లో డబుల్ మెడల్స్‌తో ఆకట్టుకున్న మనుబాకర్‌కు.. ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కొద్దిలో ఆమె పతకం చేజార్చుకుంది. ఫైనల్ పోరులో 181.1 స్కోరుతో మను ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్ల బృందం కాంస్యాన్ని త్రుటిలో మిస్ అయ్యింది. అటు సాఫ్ట్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు జై మీనాకు కాంస్యం దక్కింది. సెమీస్‌లో జపాన్ క్రీడాకారుడి చేతిలో జై 2-4తో ఓటమిపాలయ్యాడు.

## కెప్టెన్ శతకం వృథా.. రెండో వన్డేలో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

మొహాలీ: మూడు అనధికారిక వన్డేలు, మూడు అనధికారిక టి-20లు, ఒక అనధికారిక టెస్ట్ ఆడేందుకు ఆస్ట్రేలియా మహిళల ఎ జట్టు భారత్‌కు వచ్చింది. ఇందులో భాగంగా టి-20 సిరీస్‌ను కంగారూ జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. అయితే ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అయితే మొహాలీ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 338 పరుగుల భారీ స్కోర్‌ను సాధించింది. కెప్టెన్ యస్తికా భాటియా సెంచరీతో చెలరేగింది. 84 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 112 పరుగులు చేసింది. ఇక తేజల్ హసాబ్నిస్ (60), అనుష్క శర్మ (60 నాటౌట్) అర్ధ శతకాలు సాధించారు. ఆసీస్ బౌలింగ్‌లో డార్సీ బ్రౌన్ మూడు వికెట్లు, మిల్లీ ఇల్లింగ్‌వర్త్ రెండు వికెట్లు, లల్లీ మిల్స్ ఒక వికెట్ తీశారు.అనంతరం లక్ష్య చేధనలో ఆసీస్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ నికోలి ఫాల్తుమ్(12)ను సయాలీ సత్గరే తక్కువ స్కోర్‌కే పెవిలియన్ పంపింది. కానీ ఆ తర్వాత మరో ఓపెనర్ తాహిలా విల్సన్ (79), అనికా లిరాయిడ్ (54) హాఫ్ సెంచరీలు చేశారు. ఇక చార్లి నాట్ 37 బంతుల్లోనే 63 పరుగులతో అదరగొట్టింది. హేలీ సిల్వర్ హోమ్స్ (47), టెస్ ఫ్లింటాఫ్ (38) పరుగులతో రాణించారు. అయితే భారత బౌలర్లు విజయం సాధించడానికి ఆఖరి వరకూ పోరాడారు. కానీ, విజయం మాత్రం ఆసీస్‌ని వరిచింది. 49.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయిన ఆసీస్ 341 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఈ సిరీస్‌ని 1-1 తేడాతో సమం చేసింది. మూడో వన్డే శుక్రవారం మొహాలీ వేదికగా జరగనుంది.



## కుర్రాళ్లు కుమ్మేశారు.. ఆసీస్‌తో సిరీస్ క్లీన్ స్వీప్



రాజ్‌కోట్: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన మూడు అనధికారిక వన్డేల సిరీస్‌ని భారత అండర్-19 జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో అనధికారిక వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నామమాత్రపు మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ జెడ్ హోలిక్(87), నీల్ పటేల్(51) అర్ధ శతకాలతో రాణించారు. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వ, మోనల్ చౌహన్ తలో మూడు వికెట్లు తీయగా.. ఆర్యన్ సవసాని, కావ్య పటేల్ చెరో వికెట్ పడగొట్టారు.అనంతరం లక్ష్య చేధనకు దిగిన భారత్‌కు మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ శుభారంభం అందించాడు. 31 బంతులు ఎదురుకున్న అతడు 5 ఫోర్ల సాయంతో 34 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అనంతరం కెప్టెన్ లక్ష్య రాయ్‌చందన్ ఆసీస్ బౌలర్లను టార్గెట్ చేశాడు. ఆచితూచి ఆడుతూ.. 100 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 106 బంతులు ఎదురుకున్న అతడు 9 ఫోర్లు, 3 సిక్సులతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరితో పాటు కుశాగ్ర ఓఝా(45), రజత్ బఘేల్ (44 నాటౌట్) రాణించారు. ఫలితంగా భారత్ 4 వికెట్లు కోల్పోయి 41.2 బంతుల్లో లక్ష్యాన్ని చేధించింది. ఆసీస్ బౌలర్లలో స్పెన్సర్ గ్రీన్ రెండు వికెట్లు సాధించాడు.

# కూచిపూడితో మెప్పించిన డింపుల్ హయాతి..

## తిరుమలలో ప్రత్యేక ప్రదర్శన!



టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ విశేషాలు చూద్దాం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. నెటిజన్ల ఆశ్చర్యం, ప్రశంసలు : ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సినిమా కెరీర్ మరియు క్రేజ్: తెలుగు, తమిళ సినిమాల్లో నటించి మంచి నటిగా పేరు తెచ్చుకున్న డింపుల్, వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంలో 'జర్రా జర్రా' స్పెషల్ సాంగ్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత ఖిలాడి, రామబాణం, అత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. 'ఆదర్శ కుటుంబం'తో త్వరలో ముందుకు: ప్రస్తుతం సరైన సినిమా బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న డింపుల్ హయాతి, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నట్టు టాక్. ఈ భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో ఆమెకు పెద్ద హిట్ అందుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇక అంతేగాక శర్వానంద్ 38వ సినిమా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఓ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.వెండితెరపై తన గ్లామర్, నటనతో ఆకట్టుకునే డింపుల్ హయాతి, తిరుమలలో ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో తనలోని సంప్రదాయ కళాత్మక కోణాన్ని ఆవిష్కరించారు. భక్తిభావంతో ఆమె చేసిన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరి మనసులను దోచుకోవడమే కాకుండా, ఆమె కెరీర్‌కు మరింత సానుకూలతను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు.

# ఇక మైత్రీ థియేటర్లలో 'సర్వపిండి'..


## సినిమా చూస్తూ కమ్మని రుచి.. 'ది ప్యారడైజ్'తో ఎంట్రీ!




ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ 'మైత్రీ' తమ థియేటర్ల ద్వారా ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సినిమా అనుభూతికి తెలంగాణ సంస్కృతిని, అచ్చమైన పల్లె రుచులను జోడిస్తూ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో తెలంగాణ సంప్రదాయ వంటకమైన 'సర్వపిండి'ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

తొలి దశలో భాగంగా మైత్రీ విమల్, మైత్రీ శివగంగ థియేటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో విరామంలో ప్రేక్షకులు ఈ కమ్మని సర్వపిండిని ఆస్వాదించవచ్చు. సినిమా చూస్తూనే, తెలంగాణ ప్రత్యేక వంటకాన్ని రుచి చూసే ఈ కొత్త అనుభవం సినీ ప్రియులను ఆకట్టుకుంటుందని సంస్థ భావిస్తోంది.ఈ సరికొత్త ఆలోచన వెనుక సోషల్ మీడియాలో ప్రజాదరణ పొందిన 'బామ్మాస్టోరిస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ కృషి ఉంది. ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో ఆమె ప్రేమతో తయారు చేసే సర్వపిండి, ఇప్పుడు ఏకంగా బిగ్ స్క్రీన్ ప్రేక్షకులకు చేరువ కావడం విశేషం. వెండితెరపై దృశ్యాలను ఆస్వాదిస్తూనే, తెలంగాణ అసలైన రుచిని అందించాలన్న మైత్రీ థియేటర్స్ ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

# 'ప్యారడైజ్'లో నాని 'జడల్' పాత్రకు స్ఫూర్తి ఈ ఫొటోనే!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన తాజా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం రేపు (సెప్టెంబరు 24) విడుదల కానున్న నేపథ్యంలో, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాలోని కీలకమైన 'జడల్' పాత్రకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ పాత్రకు, ముఖ్యంగా నాని జడల లుక్‌కు తన చిన్ననాటి జ్ఞాపకాలే స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియాలో తన చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "జడల్ పుట్టుక, యుద్ధం కల్పితం కావచ్చు... కానీ అతని జడలు, లుక్ నా చిన్నప్పటి స్ఫూర్తితో వచ్చినవే. అమ్మ నాకు 5, 6 ఏళ్ల వయసు వరకు జడలు వేసి కట్టేవారు. నేను పెద్దయ్యాక, కమర్షియల్ సినిమాలో ఒక హీరో జడలతో 70ఎమ్ఎమ్ స్క్రీన్‌పై ఎలా ఉంటాడా అని ఎప్పుడూ ఊహించుకునేవాడిని. ఇప్పుడు నా హీరో నాని అన్నను జడల్‌గా మీ ముందు ఉంచుతున్నాను. ఈ చిత్రం కేవలం నా చిన్నతనం కాదు, నా ప్యారడైజ్" అని ఆయన పేర్కొన్నారు.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు పంచుకున్న ఈ వ్యక్తిగత విషయం



# తెలుగు ఇండస్ట్రీని చూసి కన్నీళ్లొచ్చాయి : 'ది ప్యారడైజ్' నటుడు రాఘవ్ జుయల్

ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు.

ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'క్రాక్‌రాక్స్' అనే స్టేజ్ పేరుతో తన స్లో-మోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత 'డ్యాన్స్ ప్లస్' వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు.

# నంది అవార్డుల కోసం దరఖాస్తు విధానం- మార్గదర్శకాలు!






ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ - నాటకరంగ అభివృద్ధి సంస్థ (విజయవాడ) 2025 సంవత్సరానికి సంబంధించిన -చలనచిత్ర నంది బహుమతులు - 2025- , ౨౨ నంది బహుమతులు - 2025- కోసం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను, టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పురస్కారాలను అందజేస్తోంది. అర్హులైన నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల నుండి దరఖాస్తులను సంస్థ ఆహ్వానించింది. చలనచిత్ర విభాగంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది చలనచిత్ర నిబంధనలను అనుసరించి 2025 సంవత్సరానికి ఉత్తమ ఫిల్మ్ నిర్మాతలు, ఉత్తమ కళాకారులు.. ఉత్తమ సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషలో భారతదేశంలో ఎక్కడైనా నిర్మించి.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ -సీబీఎఫ్‌సీ ద్వారా థియేటర్లలో ప్రదర్శించిన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యాసంబంధమైన చిత్రాలు అలాగే తెలుగు సినిమా మీద వచ్చిన పుస్తక రచనలు, రచయితలు, నిర్మాతలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ఇక టెలివిజన్ రంగానికి సంబంధించి 2025 సంవత్సరానికి నంది టి.వి. చిత్ర నిబంధనల ప్రకారం ఉత్తమ టి.వి. చిత్ర నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించనున్నారు. టెలిఫిల్మ్స్, టి.వి. ఫీచర్స్, టి.వి. మెగాసీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సామాజిక అంశాలు, విద్య సంబంధిత చిత్రాల రూపకర్తలు ఈ బహుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవార్డులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు.. ఇతర వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ **www.apsftvdc.in** ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పొందుపరుచుటకు చివరి తేదీగా 12.10.2026ను నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల ప్రింట్ ప్రతులను సంబంధిత డాక్యుమెంట్లతో జతపరిచి నిర్దేశిత గడువులోగా అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను -మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ, 4వ అంతస్తు, ఎన్.టి.ఆర్. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిత్ నెహ్రూ బస్ కాంప్లెక్స్, విజయవాడ - 520013- చిరునామాకు పంపడానికి చివరి తేదీ 16.10.2026గా ఖరారు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఐ.ఏ.ఎస్., తెలిపారు. కళాకారులు - నిర్మాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

Editor: E.Ramana Printed & Published and Owned by E.Mukteshwari, D.No. 2-8-259, Mukarampura, Karimnagar and Printed at Sri Venkatarama, Printers at D.No. 2-28, Setharampur, Karimngar
Ph: 0878-6500033, E-mail:news.vaarthalu@gmail.com RNI NO. AP Tel/2008/24179